thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 34 | జగిత్యాల | గురువారం | 23 ఏప్రిల్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

డే1

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సు చక్రం నిలిచిపోయింది. డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ జేఏసీ పిలుపునిచ్చిన సమ్మెతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచే కార్మికులు విధులను బహిష్కరించారు. డిపోల వద్ద కార్మికులు నిరసనలకు దిగడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బస్సులు రోడ్డెక్కకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తుండడంతో ఆటోలు, క్యాబ్‌లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది.



# ఆర్టీసీ సమ్మె

## డిపోలకే పరిమితమైన బస్సులు





- అర్ధరాత్రి నుంచి సమ్మె సైరన్
- ప్రయాణికుల పాట్లు.. మెట్రో రైళ్ల రద్దీ
- కరీంనగర్‌లో అద్దె బస్సు ప్రమాదం
- చర్చలకు సిద్ధమన్న ఆర్టీసీ ఎండీ

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. మిగతా 2 లో





## సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు

- కార్మికుల పోరాటానికి సంఘీభావం
- హామీలు అమలు చేయని ప్రభుత్వం
- 3,000 కోట్ల బకాయిలు చెల్లించాలి
- డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు



3



## నేడు మహాధర్నా

డిపోల ఎదుట ఉదయం నుంచే నిరసనలు 2

## సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

- వెంటనే సమ్మె విరమించి రండి
- ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి



2

# కాళేశ్వరం కేసులో కేసీఆర్‌కు ఊరట!



- ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై హైకోర్టు కీలక ఆదేశం
- పిటిషనర్లపై చర్యలు తీసుకోవద్దని వెల్లడి
- నివేదిక లీకేజీపై ధర్మాసనం అసహనం
- కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమే అన్న కోర్టు
- హరీశ్‌రావు, అధికారులకు సైతం ఊరట

2

## ధర్మమే గెలిచింది

హరీశ్‌రావు 3

# కాళేశ్వరంలో ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

- పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు రాజ్యాంగబద్ధమే
- సీబీఐ విచారణకు హైకోర్టు తీర్పు అడ్డంకి కాదు
- మూడేళ్లకే కుంగిన ప్రాజెక్టు: మంత్రి ఉత్తమ్

వివరాలు 3వ పేజీలో





## కాంగ్రెస్ సర్కార్‌కు చెంపపెట్టు!

- విచారణలో ప్రభుత్వం వైఫల్యం
- కేంద్రమంత్రి జీ కిషన్ రెడ్డి

3

## దావోస్, గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడులపై ఆరా

ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూ కేటాయింపులు

ప్రముఖ కంపెనీలకు తొలి వెడతలో భూములు

అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ సూచన 2





## వాయిదాల్లో ఓటుకు నోటు కేసు విచారణ

2

రెండు వారాలకు వాయిదా వేసిన సుప్రీం

## కాళేశ్వరంపై సీబీఐ విచారణకు సిద్ధమా?



- నిజాయితీ ఉంటే ముందుకు రండి
- బీఆర్ఎస్ నాయకత్వానికి మంత్రి పొంగులేటి సవాల్
- బీజేపీతో 'చీకటి ఒప్పందాల' వల్లే విచారణను తప్పించుకుంటున్నారా?

2


## టెర్రరిస్టుపై నోటీసులు

24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని

వివరణ ఖర్గేకు ఈసీ ఆదేశం



3



## మాజీ సీఎం నాదెండ్ల మరణం

చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత

మంత్రి కందుల దుర్గేశ్ తదితరుల సంతాపం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్‌రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

2

# కాల్పుల విరమణ పొడిగింపు

ట్రంప్ సంచలన నిర్ణయం!



- పాకిస్థాన్ విన్నపంతో వెనక్కి తగ్గిన అగ్రరాజ్యం..
- స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన
- ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అధ్యక్షుడు

4

## ఓడిపోయిన వారు షరతులు విధించలేరు!



- ట్రంప్‌కు ఇరాన్ ఘాటు కౌంటర్
- కాల్పుల విరమణ పొడిగింపు ఒక 'డ్రామా'..
- ఆకస్మిక దాడి కోసమే అమెరికా ఎత్తుగడ



# దావోస్, గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడులపై ఆరా

## ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూ కేటాయింపులు

## ప్రముఖ కంపెనీలకు తొలి వెడతలో భూములు

## అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ సూచన

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** ఎంఓయూలు కుదుర్చుకున్న కంపెనీలకు వివిధ ప్రాంతాల్లో కేటాయించాల్సిన భూములకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కంపెనీలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. పెట్టుబడులకు సంబంధించి దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో పలు కంపెనీలతో జరిగిన ఎంఓయూ లు, పురోగతిపై సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి చర్చించారు. వివిధ రంగాలలో పెట్టుబడులకు సంబంధించి ఇప్పటి వరకు గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఫ్యూచర్ సిటీతో పాటు వివిధ ప్రాంతాల్లో సంస్థలకు ప్రాధాన్యతల వారీగా కేటాయించాల్సిన భూ వివరాలను సీఎంకు తెలిపారు. డేటా సెంటర్లకు అవసరమైన నీటిని ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సిఎం అన్నారు. పేరున్న బ్రాండ్ సంస్థలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా ఎంఓయూలు కుదుర్చుకున్న సంస్థలు తమ కార్యకలాపాలు మొదలు పెట్టేలా చూడాలని, ఇందుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు.

# వాయిదాల్లో ఓటుకు నోటు కేసు విచారణ

## రెండు వారాలకు వాయిదా వేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** ఓటుకు నోటు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును మరో రెండు వారాల తర్వాత విచారిస్తామని తెలిపింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ విజయ్ బిష్ణోయ్ కూడా సభ్యుడిగా ఉన్నారు. మంగళవారం ఈ కేసు విచారణ జరిగింది. ముఖ్యంగా ఈ కేసులో రెండు కీలక పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఒకటి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కాగా, మరొకటి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కీలక నేత సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసినది. సీఎం రేవంత్ రెడ్డి తన పిటిషన్‌లో ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల ప్రకారమే విచారించాలని కోరారు. ఈ కేసును క్రిమినల్ అవినీతి కేసుగా కాకుండా ఎన్నికల ఉల్లంఘనగా పరిగణించాలని ఆయన వాదించారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తనపై నమోదైన ఈ కేసులో తన పేరును పూర్తిగా తొలగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తనపై ఉన్న ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని ఆయన వాదించారు. ఈ రెండు పిటిషన్లను కలిపి విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దీంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఓటుకు నోటు కేసు గతంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడినప్పటికీ, ఈ కేసు ప్రాధాన్యం మాత్రం తగ్గలేదు. వచ్చే విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయాలు రాజకీయంగా కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, నైతిక విలువలపై ఈ కేసు కీలకంగా నిలుస్తోంది.

# కాళేశ్వరంపై సీబీఐ విచారణకు సిద్ధమా?

## నిజాయితీ ఉంటే ముందుకు రండి

## బీఆర్ఎస్ నాయకత్వానికి మంత్రి పొంగులేటి సవాల్



**హైదరాబాద్, ఏప్రిల్22:** వేల కోట్ల ప్రజా ధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు.. ఇప్పుడు రాజకీయ రణరంగంగా మారింది. ఈ ప్రాజెక్టులో ఎక్కడా అవినీతి జరగలేదని, హైకోర్టు తమకు 'క్లీన్ చీట్' ఇచ్చిందని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారంపై రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నిప్పులు చెరిగారు. నిజంగా మీరు నిర్దోషులైతే, మీ నిజాయితీని నిరూపించుకోవడానికి సీబీఐ విచారణకు సిద్ధమా? అంటూ ఆయన విసిరిన సవాల్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పొంగులేటి బీఆర్ఎస్ అగ్ర నాయకత్వంపై విరుచుకుపడ్డారు. కాళేశ్వరంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని గొంతు చించుకుంటున్న నేతలు, స్వతంత్ర సంస్థల ద్వారా విచారణ జరిపించడానికి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. విచారణ జరిగితే లక్ష కోట్ల ప్రాజెక్టులో జరిగిన భారీ ఆర్థిక దోపిడీ, కమిషన్ల బాగోతం, కాంట్రాక్టుల లోపాలు అన్నీ బయటపడతాయనే భయం వారిని వెంటాడుతోందని మంత్రి ఎద్దేవా చేశారు. ఈ పాపాల నుంచి తప్పించుకోవడానికే బీజేపీతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని ఆయన ఆరోపించారు. మేడిగడ్డ వంటి కీలక బ్యారేజీలు కుంగిపోవడం, పంప్ హౌస్‌లు నీట మునగడం వంటి ఘటనలు కేవలం ప్రకృతి వైపరీత్యాలు కావని మంత్రి స్పష్టం చేశారు. "ఇవి కేవలం సాంకేతిక లోపాలు కావు.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ అవినీతికి నిలువెత్తు నిదర్శనాలు" అని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరంతో పాటు గత ప్రభుత్వంలో నిర్మించిన చెక్ డ్యామ్‌లు కుప్పకూలడం ప్రజా ధనాన్ని ఏ విధంగా దుర్వినియోగం చేశారో చెబుతున్నాయని గుర్తు చేశారు. వేల కోట్లు ఖర్చు చేసి 'గ్లోబల్ ప్రచారం' చేయడం ద్వారా ప్రజలను ఎంతో కాలం మోసం చేయలేరని హెచ్చరించారు. కేసీఆర్, కేటీఆర్ ఈ అంశంపై స్పష్టమైన సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల చెమట చుక్కతో నిర్మించిన ప్రతి ఇటుకపై, ఖర్చు చేసిన ప్రతి రూపాయిపై లెక్క చెప్పాల్సిన రోజు దగ్గరలోనే ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని వంచించిన వారిని చట్టం ముందు నిలబెట్టే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గదని తేల్చి చెప్పారు. "నిజం మీ వైపు ఉంటే విచారణకు రండి.. లేదంటే మీ మౌనమే మీ నేరాన్ని ఒప్పుకున్నట్లు అవుతుంది" అని పొంగులేటి హెచ్చరించారు.

# ఆర్టీసీ సమ్మె.. డిపోలకే పరిమితమైన బస్సులు

- అర్ధరాత్రి నుంచి సమ్మె సైరన్
- ప్రయాణికుల పాట్లు.. మెట్రో రైళ్ల రద్దీ
- కరీంనగర్‌లో అద్దె బస్సు ప్రమాదం
- చర్చలకు సిద్ధమన్న ఆర్టీసీ ఎండీ



**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో తెలంగాణ వ్యాప్తంగా రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. డిపోల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బస్సులు నడవకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తుండడంతో ఆటోలు, క్యాబ్‌లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ప్రయాణికుల కోసం ప్రభుత్వం అద్దె బస్సులను ఏర్పాటు చేసింది. అయితే కరీంనగర్‌లో ఓ అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కోతిరాంపూర్ బైపాస్ వద్ద అదుపు తప్పి జరిగిన ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం ధ్వంసమై ప్రయాణికులు గాయపడ్డారు. శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడపడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల కండక్టర్లు లేకుండానే బస్సులను నడుపుతున్నారు. బస్సులు లేకపోవడంతో నగరవాసులు మెట్రో రైళ్లపై ఆధారపడుతున్నారు. రద్దీని తట్టుకోవడానికి అధికారులు 56 రైళ్లను అందుబాటులోకి తెచ్చారు. మియాపూర్-ఎల్బీ నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, నాగోల్-రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రైళ్లను నడుపుతున్నారు. రాత్రి 11 గంటల తర్వాత కూడా మెట్రో సేవలను పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కార్మికుల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆర్టీసీ ఎం,డీ నాగిరెడ్డి తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కొన్ని సంఘాలు కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన విమర్శించారు. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా సమ్మె విరమించాలని కోరారు. అయితే తమ డిమాండ్లు తీరే వరకు పోరాటం ఆపేది లేదని ఆర్టీసీ జేఏసీ స్పష్టం చేసింది.

# నేడు మహాధర్నా

## డిపోల ఎదుట ఉదయం నుంచే నిరసనలు

## వెనక్కి తగ్గేది లేదన్న జేఏసీ నేతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** తమ డిమాండ్ల పరిష్కారం కోసం టీజీఎస్ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం నుంచి మరింత ఉధృతం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నా నిర్వహించాలని జేఏసీ పిలుపునిచ్చింది. ఉదయం 5 గంటల నుంచే కార్మికులు ఈ నిరసనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం, యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తూ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని నేతలు ఆరోపించారు. చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న విమర్శించారు. ప్రభుత్వం వేసిన కమిటీ అధికారులు సమస్యలను ఇప్పుడప్పుడే పరిష్కరించలేమని చెప్పడం శోచనీయమన్నారు. దీంతో కార్మికులకు సమ్మె తప్ప మరో దారి లేకపోయిందని స్పష్టం చేశారు. బుధవారం అమరవీరులకు నివాళులర్పించి ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని నేతలు కోరుతున్నారు. 2021 వేతన సవరణను 30 శాతం తగ్గకుండా అమలు చేయాలని, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర జోన్లకు చేసిన ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని స్పష్టం చేశారు. అన్ని డిపోలు, యూనిట్లు, వర్క్ షాపుల్లో ధర్నాలు మిన్నంటుతాయని పేర్కొన్నారు. ఆర్టీసీ పోరాటానికి ప్రజా సంఘాల నుంచి భారీ మద్దతు లభిస్తోంది. ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ, బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్ కృష్ణయ్య ఈ సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలకు ఆహ్వానించాలని, లేనిపక్షంలో ఈ పోరాటం మరో 'సకల జనుల సమ్మె'గా మారుతుందని ఈదురు వెంకన్న హెచ్చరించారు. కార్మికుల సమస్యలు తీరే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు.



# మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు మృతి

## చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత

## మంత్రి కందుల దుర్గేశ్ తదితరుల సంతాపం

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కర్ రావు 1978లో విజయవాడ ఈస్ట్ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978 నుంచి 1989 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. 1986 ఆగస్ట్ 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను పదవీచ్యుతిడిని చేసిన నాదెండ్ల నెలరోజులపాటు సిఎంగా కొనసాగారు. నాదెండ్ల భాస్కర్ రావు మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం జనసేన పార్టీ తరపున ఏపీ మంత్రిగా సేవలందిస్తున్నారని తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు(90) కన్నుమూశారు. గత నెల రోజులుగా నాదెండ్ల భాస్కరావు మృతి పట్ల మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'భాస్కరరావు మృతి రాజకీయ రంగానికి తీరని లోటు. ఎంతోమంది నేతలకు రాజకీయ ఓనమాలు నేర్పిన గొప్ప మార్గదర్శి నాదెండ్ల భాస్కర్ రావు. ప్రజా ప్రతినిధిగా భాస్కరరావు చేసిన సేవలు చిరస్మరణీయం. 1980వ దశకంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో ఆయన కీలక పాత్ర పోషించారు. స్వల్పకాలం ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ, అంతకుముందు మంత్రిగా ఆయనకు పరిపాలనపై గట్టి పట్టు ఉండేది. చట్టసభల పనితీరుపై ఆయనకు అపారమైన అవగాహన ఉంది. గుంటూరు జిల్లా నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేశారు' అని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.



# సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

## వెంటనే సమ్మె విరమించి రండి

## ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి



**హైదారబాద్, ఏప్రిల్ 22:** ఆర్టీసీ సమ్మెను విరమించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమస్యలకు సమ్మె పరిష్కారం కాదని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారానికి నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందని.. 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపాటు అని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి వ్యతిరేకత లేదని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అవన్నీ వెంటనే పరిష్కారమయ్యే అంశాలని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ రెండు అంశాల్లో పలు సాంకేతిక అంశాలు చరించాల్సి ఉందన్నారు. వీటిపై అధ్యయనం చేసేందుకే నాలుగు వారాల గడువు అడిగామని వివరించారు. ఈ రెండు అంశాలు కూడా సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర చర్చిస్తామని అన్నారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ.. ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికల విషయంలో నాయకుల మధ్య అంతర్యుద్ధం, నాయకత్వ అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని.. అన్ని అంశాలను పరిష్కరిస్తామని చెప్పారు. మిమ్మల్ని ఎవరూ అడ్డుకోరని.. ప్రజాస్వామ్య పద్ధతిలో మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. ప్రజలపై ఒత్తిడి తీసుకురావచ్చని అన్నారు. అయితే పేద ప్రజల ప్రయాణాలకు ఇబ్బంది కలగజేయవద్దని విజ్ఞప్తి చేశారు. మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. మిగతా వారంతా విధుల్లో చేరి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు.

# కాళేశ్వరం కేసులో కేసీఆర్‌కు ఊరట!

- ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై హైకోర్టు కీలక ఆదేశం
- పిటిషనర్లపై చర్యలు తీసుకోవద్దని వెల్లడి
- నివేదిక లీకేజీపై ధర్మాసనం అసహనం



**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ధర్మాసనం ఆదేశించింది. కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమేనని పేర్కొన్న కోర్టు, నివేదికలోని అంశాలను అసెంబ్లీలో చర్చించకుండానే మీడియాకు వెల్లడించడాన్ని తప్పుబట్టింది. దీంతో కేసీఆర్, హరీశ్‌రావుతో పాటు అధికారులైన స్మితా సబర్వాల్, ఎస్కే జోషికి ఊరట లభించినట్లయింది.

### నివేదిక లీకేజీపై కోర్టు ఆగ్రహం

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ ప్రభుత్వం 2024 మార్చిలో జీవో నంబర్ 6 ద్వారా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ కేసీఆర్ బృందం దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ విచారణ జరిపిన హైకోర్టు, ఈ రోజు తుది తీర్పు వెల్లడించింది. నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టకముందే మీడియా ముందుకు తీసుకురావడంపై అసహనం వ్యక్తం చేసింది. ఈ నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తు కోరడం లేదా ఇతర చర్యలు చేపట్టడం చెల్లదని స్పష్టం చేసింది.

### చట్టబద్ధత ఉన్నా చర్యలకు బ్రేక్

హైకోర్టు తీర్పుపై కేసీఆర్ తరపు న్యాయవాది గండ్ర మోహన్ రావు స్పందిస్తూ.. ఇది తమకు పెద్ద ఊరట అని పేర్కొన్నారు. సెక్షన్ 8 కింద సరైన విచారణ జరగలేదని కోర్టు గుర్తించిందని తెలిపారు. కమిషన్ నివేదికను ఇప్పుడు పక్కన పెట్టవచ్చని, దాని ఆధారంగా ఎలాంటి విచారణలు జరపడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టంగా చెప్పిందని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోను కోర్టు సమర్థించినప్పటికీ, నివేదిక అమలుపై ఆంక్షలు విధించడం పిటిషనర్లకు లబ్ధి చేకూర్చే అంశమేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# నేడు తెలంగాణ కేబినెట్ భేటీ!

## కాళేశ్వరం తీర్పుపై ప్రభుత్వం కీలక చర్చ

- తదుపరి అడుగులపై లోతైన విశ్లేషణ
- కమిషన్ ఏర్పాటును కోర్టు సమర్థించింది
- మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం



**హైదరాబాద్, ఏప్రిల్ 22:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ రోజు తెలంగాణ మంత్రివర్గ అత్యవసర సమావేశం జరగనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. ఈ తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం తీసుకోబోయే తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. హైకోర్టు తీర్పుపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ.. బీఆర్ఎస్ నేతలు ఆశించినట్లుగా వారికి కోర్టు నుంచి ఎలాంటి 'క్లీన్ చిట్' లభించలేదని స్పష్టం చేశారు. కేసీఆర్.. హరీశ్‌రావు కోరుకున్నట్లుగా కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పుబట్టలేదని ఆయన వివరించారు. కేవలం కొన్ని సాంకేతిక అంశాలను మాత్రమే న్యాయస్థానం ప్రస్తావించిందని.. కమిషన్ నియామకాన్ని సమర్థించడం ప్రభుత్వ ధోరణికి దక్కిన విజయమని ఆయన అభిప్రాయపడ్డారు. మంత్రివర్గ సమావేశంలో హైకోర్టు తీర్పులోని అంశాలను లోతుగా విశ్లేషించనున్నారు. కాళేశ్వరం అక్రమాలపై విచారణను మరింత పకడ్బందీగా ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై మంత్రులతో సీఎం చర్చించనున్నారు. ఈ భేటీ తర్వాత ప్రభుత్వం తన అధికారిక నిర్ణయాన్ని వెల్లడించే అవకాశం ఉంది. ప్రాజెక్టు విషయంలో నెలకొన్న న్యాయపరమైన ఉత్కంఠకు ఈ సమావేశం ఒక దిశను చూపే అవకాశం కనిపిస్తోంది.



# టెర్రరిస్టుపై నోటీసులు

## 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని వివరణ ఖర్గేకు ఈసీ ఆదేశం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి 'టెర్రరిస్టు' అంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలను ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఖర్గేకు నోటీసు పంపింది. ఖర్గే వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఉన్నందున ఆయనపై చర్య తీసుకోవాలని, బహిరంగంగా క్షమాపణ చెప్పాల్సిందిగా ఆదేశించాలని బీజేపీ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఈసీకి బుధవారం ఉదయం ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఖర్గే వివరణ కోరుతూ ఎన్నికల కమిషన్ నోటీసు ఇచ్చింది. ప్రధానమంత్రిని ఉగ్రవాదిగా పేర్కొనడం యావద్దేశాన్ని అవమానించడమేనని బీజేపీ ప్రతినిధుల బృందంలోని నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈసీకి ఫిర్యాదు చేశారు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడంతో పాటు భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 175 కింద నేరమవుతుందని, పరువునష్టం కేసు వేసేందుకు అవసరమైన ప్రాథమిక సాక్ష్యంగా ఆయన వ్యాఖ్యలు నిలుస్తాయని ఈసీ దృష్టికి తెచ్చారు. అన్నాడీఎంకే, బీజేపీ పొత్తుపై ఖర్గే తమిళనాడు ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ, ఆ పార్టీ మోదీతో ఎలా చేతులు కలిపిందని ప్రశ్నించారు. ఆయనకు సమానత్వం, న్యాయంపై నమ్మకం లేవన్నారు. అలాంటి వాళ్లతో అన్నాడీఎంకే కలవడమంటే ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమేనని విమర్శించారు. ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించడంతో ఆయన తిరిగి వివరణ ఇచ్చారు. మోదీని తాను ఎప్పుడూ ఉగ్రవాది అని అనలేదని, ప్రజలు, రాజకీయ పార్టీలను ఆయన భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పడమే తన ఉద్దేశమని వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో కిరణ్ రిజిజు మాట్లాడుతూ, ఈసీఐని బీజేపీ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం కలిసినట్టు చెప్పారు. ఎంతో బాధ, ఆగ్రహంతో తాము ఇక్కడకు వచ్చామన్నారు. ప్రధానమంత్రి మోదీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అవమానించిన తీరే ఇందుకు కారణమని అన్నారు. ప్రధానమంత్రిని ఉగ్రవాదిగా పేర్కొనడం యావద్దేశాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. దీనికి ముందు, ఖర్గే వ్యాఖ్యల వివాదంపై ఎన్నికల కమిషన్‌కు బీజేపీ ఒక లేఖ రాసింది. ఖర్గే వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడం కిందకు వస్తుందని పేర్కొంది.



# కాంగ్రెస్ సర్కార్‌కు హైకోర్టు చెంపపెట్టు!

## కాళేశ్వరం విచారణలో రేవంత్ ప్రభుత్వం వైఫల్యం

## కోర్టులో సాక్ష్యాలు చూపలేక చేతులెత్తేసిన వైనం

## బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య లోపాయికారి ఒప్పందం

## కేంద్రమంత్రి జీ కిషన్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి విచారణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్రమంత్రి జీ కిషన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను మరోసారి బట్టబయలు చేసిందని విమర్శించారు. వేల కోట్ల అక్రమాలు జరిగాయని ప్రచారం చేసిన పాలకులు, ఆ సాక్ష్యాలను న్యాయస్థానం ముందు సమర్థవంతంగా ఉంచలేకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా ఆధారాలు సమర్పించడంలో విఫలమవడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని దుయ్యబట్టారు. అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకుంటామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు వారితో కలిసి 'దూప్ ఫైటింగ్' చేస్తోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. "నేను గిచ్చినట్లు చేస్తా, నువ్వు ఏడ్చినట్లు చెయ్" అన్న చందంగా రెండు పార్టీల వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల వేళ పెద్ద పెద్ద మాటలు చెప్పిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక రెండేళ్లయినా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కేవలం మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని ఈ తీర్పుతో రుజువైందన్నారు. కాళేశ్వరంతో పాటు ఫార్ములా వన్ రేసు, డ్రగ్స్ కేసులు, భూ ఆక్రమణలు, మిషన్ భగీరథ లాంటి పథకాల్లో భారీ అక్రమాలు జరిగాయని చెప్పిన సీఎం, వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. అవినీతి సొమ్మును కక్కించి పేదలకు పంచుతామన్న హామీ ఏమైందని నిలదీశారు. తెలంగాణ ప్రజలను రెండు పార్టీలు కలిసి మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాలయాపన మానుకుని, అక్రమాలకు పాల్పడిన వారిపై పారదర్శకమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ వైఫల్యానికి రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# కాళేశ్వరంలో ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

## పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు రాజ్యాంగబద్ధమే

## సీబీఐ విచారణకు హైకోర్టు తీర్పు అడ్డంకి కాదు

## నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందేనని న్యాయస్థానం అభిప్రాయపడిందని ఆయన తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కమిషన్ నియామకం కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6 చట్టబద్ధమైనదని, అది అధికార పరిధిని మించి ఏమీ లేదని కోర్టు స్పష్టం చేసినట్లు వివరించారు. కమిషన్ ఏర్పాటు అక్రమమని పిటిషనర్లు చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చిందని ఆయన పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు ఎలాంటి అడ్డంకి కాదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. కాళేశ్వరంలో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని తమ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిందని గుర్తు చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీనే దీనిపై జీవోతో పాటు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఈ రోజు వచ్చిన తీర్పు కేవలం నోటీసుల జారీ వంటి సాంకేతిక అంశాలకు సంబంధించిందే తప్ప, అవినీతిపై సాగే విచారణను ఆపలేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోవడం అనేది ముమ్మాటికీ మానవ తప్పిదమేనని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు సైట్ ఎంపిక నుంచి డిజైన్ల తయారీ, నిర్మాణం, నిర్వహణ వరకు అన్ని దశల్లోనూ లోపాలు ఉన్నాయని విజిలెన్స్ కమిషన్, ఎన్డీఎస్ఏ ఇప్పటికే తేల్చాయని చెప్పారు. లక్ష కోట్ల ప్రజా ధనంతో నిర్మించిన బ్యారేజీలు మూడేళ్లకే కుంగిపోవడం దేశంలోనే అతిపెద్ద విధ్వంసం అని అభివర్ణించారు. ఏటా ఈ ప్రాజెక్టు అప్పులు, వడ్డీల రూపంలోనే 15 నుంచి 20 వేల కోట్ల రూపాయల భారం ప్రభుత్వంపై పడుతోందని ఆయన వివరించారు. న్యాయస్థానం నివేదికలోని కొన్ని వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, అది కేవలం నోటీసులు ఇవ్వలేదనే కారణం వల్లే జరిగిందన్నారు. పూర్తి తీర్పు కాపీ వచ్చిన తర్వాత ప్రభుత్వం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఈ అక్రమాలకు ఎవరు బాధ్యులో, ఎవరు దోషులో తేల్చి తీరుతామని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన తీరును ఎవరైనా స్వయంగా చూడవచ్చని, ఇంత పెద్ద నష్టానికి బాధ్యులైన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు.

# పీసీ ఘోష్ నివేదికకు విలువే లేదు

## అది కమిషన్ కాదు.. పీసీసీ నివేదిక : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై హైకోర్టు వెలువరించిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలకు చెంపపెట్టు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు.. ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని తాము మొదటి నుంచీ చెబుతున్న మాట నేడు అక్షరసత్యమని నిరూపితమైందని అన్నారు. కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించిన వారికి ఈ తీర్పు గుణపాఠమని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుతో తెలంగాణ ప్రజలు.. రైతులు.. ఇంజనీర్లకు విజయం చేకూరిందని కేటీఆర్ తెలిపారు. మూడేళ్లుగా కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణలో పారుతున్న ప్రతి నీటి బొట్టు వెనుక కేసీఆర్ కృషి ఉందని.. భూమిపై గోదావరి ప్రవహించినంత కాలం ఆయన చరిత్రను ఎవరూ చెరపలేరని స్పష్టం చేశారు. ప్రాజెక్టు కోసం రూ. 94 వేల కోట్లు ఖర్చు చేస్తే.. రూ. లక్ష కోట్లు అంటూ తప్పుడు ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం మేడిగడ్డ బ్యారేజీపై రూ. 3,800 కోట్లు మాత్రమే వెచ్చించామని వివరించారు.

# ఆర్టీసీ సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు!

## కార్మికుల పోరాటానికి సంఘీభావం

## మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, ఏప్రిల్ 22:** ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ సంఘీభావం తెలుపుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గత కేసీఆర్ ప్రభుత్వమే క్యాబినెట్ ఆమోదం తెలిపిందని.. జీవోలు, గెజిట్ కూడా జారీ చేసిందని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో చెప్పిన హామీలనే అమలు చేయాలని కార్మికులు కోరుతున్నారని ఆయన పేర్కొన్నారు. రెండున్నరేళ్లు దాటుతున్నా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవడం వల్లే కార్మికులు సమ్మె బాట పట్టారని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని.. కార్మికులతో తక్షణమే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారి న్యాయమైన కోరికలను తీర్చాలని సూచించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి ప్రభుత్వం నుంచి సుమారు రూ. 3,000 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని ఆయన తెలిపారు. ఈ నిధులు రాకపోవడం వల్లే ఉద్యోగులకు డీఏలు.. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఈ బకాయిలు చెల్లించి సంస్థను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల పక్షాన బీఆర్ఎస్ ఎప్పుడూ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# అనిల్ జైన్ పై చర్య తీసుకోండి!

## ఎన్డీఎస్ఏ ఛైర్మన్ తీరుపై బండి సంజయ్ ఆగ్రహం

## సీఎం పర్యటనలో పాల్గొనడంపై అభ్యంతరం



**హైదరాబాద్, ఏప్రిల్ 22:** నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఛైర్మన్ అనిల్ జైన్ పై తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం కేంద్ర జలశక్తి మంత్రికి లేఖ రాశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన కార్యక్రమంలో అనిల్ జైన్ పాల్గొనడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నెల 20వ తేదీన కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే సీఎం మేడిగడ్డను సందర్శించారని.. అటువంటి కార్యక్రమంలో ఒక బాధ్యతాయుతమైన అధికారి ఎలా పాల్గొంటారని సంజయ్ ప్రశ్నించారు. భవిష్యత్తులో బ్యారేజీలకు ఏవైనా నష్టం వాటిల్లితే ఆ నిందను ఎన్డీఎస్ఏ మీదకు నెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బండి సంజయ్ హెచ్చరించారు. కమిటీ ఇచ్చిన నివేదికలు, సిఫార్సులను నీరుగార్చేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. అనిల్ జైన్ వ్యవహారశైలిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తన లేఖలో కోరారు.

# ఆరుగురు ఐపీఎస్ అధికారులకు డీజీ హోదా!

## తెలంగాణలో సీనియర్లకు పదోన్నతులు

## 1995, 1996 బ్యాచ్ అధికారులకు ప్రమోషన్

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** తెలంగాణలో పనిచేస్తున్న ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం డైరెక్టర్ జనరల్ (డీజీ) హోదా కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన అధికారులకు ఈ పదోన్నతులు లభించాయి. 1995 బ్యాచ్‌కు చెందిన మహేష్ భగవత్.. స్వాతి లక్రా.. వీవీ శ్రీనివాసరావు డీజీ హోదా పొందారు. వీరితో పాటు 1996 బ్యాచ్‌కు చెందిన చారు సిన్హా.. అనిల్ కుమార్.. వీసీ సజ్జనార్‌కు కూడా డైరెక్టర్ జనరల్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పదోన్నతుల ద్వారా పోలీస్ శాఖలో మరింత పారదర్శకత.. వేగవంతమైన సేవలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# ధర్మమే గెలిచింది

## ఘోష్ కమిషన్ నివేదికపై కోర్టు స్టేతో ఊరట

## బట్టబయలైన కాంగ్రెస్ రాజకీయ కుట్రలు

## కాళేశ్వరమే తెలంగాణకు ప్రాణేశ్వరం : మాజీ మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ మంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా అంతిమంగా ధర్మమే గెలుస్తుందని, ఈ రోజు సత్యం నిలబడిందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తన స్పందనను తెలియజేశారు. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ సాగిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టడం హర్షణీయమని తెలిపారు. వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని కోర్టు స్పష్టం చేసిందని హరీశ్‌రావు అన్నారు. ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోకూడదని కోర్టు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్ ప్రభుత్వం పన్నిన రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయని విమర్శించారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టి డ్రామాలాడుతున్న రేవంత్ రెడ్డి నిజస్వరూపం ఈ తీర్పుతో తేటతెల్లమైందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. వెంటనే కుంగిన పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఎవరు అవునన్నా కాదన్నా కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు మణిహారం లాంటిదని, అది ఎప్పటికీ రాష్ట్రానికి ప్రాణేశ్వరమని కొనియాడారు. జై తెలంగాణ, జై కేసీఆర్ అంటూ తన పోస్టును ముగించారు.

# పోటు రంగారావుపై ఎన్ఐఏ ప్రశ్నల వర్షం!


## ఖమ్మం పార్టీ ఆఫీసులో రెండున్నర గంటల పాటు విచారణ

## గాదె ఇన్నయ్యతో సంబంధాలు, కగార్ అంశాలపై ఆరా

## మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి విచారణ

**ఖమ్మం, ఏప్రిల్ 22:** మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావును బుధవారం ఎన్ఐఏ అధికారులు విచారించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయం రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నలుగురు అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. సుమారు రెండున్నర గంటల పాటు ఈ విచారణ ప్రక్రియ కొనసాగింది. విచారణ అనంతరం పోటు రంగారావు మీడియాతో మాట్లాడుతూ.. అధికారులు తన విద్యాభ్యాసం, వివాహం, సంతానం వంటి వ్యక్తిగత వివరాలను అడిగారని తెలిపారు. ముఖ్యంగా గాదె ఇన్నయ్యతో ఉన్న సంబంధాలపై ఆరా తీశారని పేర్కొన్నారు. హెడ్మా తల్లిని ఓదార్చిన అంశంలో ఆర్థిక సాయం, నిషేధిత పార్టీలతో ఉన్న విభేదాలపై కూడా ప్రశ్నలు సంధించినట్లు వెల్లడించారు. "కగార్ ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?", "ఎన్ఐఏ పట్ల సమాజంలో భయాందోళనలు ఎందుకు రేకెత్తిస్తున్నారు?", "కగార్ కు వ్యతిరేకంగా ఎందుకు నిరసనలు చేపట్టారు?" వంటి అంశాలపై అధికారులు తనను ప్రశ్నించారని రంగారావు వివరించారు. ఎన్ఐఏ అధికారులు రంగారావును విచారిస్తున్నారన్న సమాచారంతో పార్టీ నాయకులు, లాయర్లు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకున్నారు.






సంపాదకీయం

# ర్యాంకుల గోలతో విద్యార్థులపై ఒత్తిడి!

టీవీలు, పేపర్ల నిండా ర్యాంకుల గోల. మా వద్ద చదివిన వారికి ర్యాంకులే ర్యాంకులు అంటూ... ప్రకటనలు.. 1,2,3 ఇలా టీవీల్లో ఊదరగొడుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే...ర్యాంకుల గొడవలో పిల్లల్లో సృజనాత్మకతను దెబ్బతీస్తున్నారు. లక్షల్లో ఫీజులు వసూళ్లు చేసి, పేద మధ్యత తరగతి వారిని మాయలో పడేస్తున్నారు. ఇంతపెద్ద దేశంలో ఇలాంటి చదువులు సాగుతున్నందుకు సిగ్గుపడాలి. ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా భ్రష్టు పడుతోంది. ప్రభుత్వ హాస్టళ్లు నానాటికి తీసికట్టుగా తయారవుతున్నాయి. విద్యార్థులకు సరైన తిండి దక్కడం లేదు. ఫుడ్ పాయిజనింగ్‌తో చస్తున్నారు. అయినా పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. నానా రకాల పేర్లతో హాస్టళ్లు పెట్టి పిల్లలను ఘోష పెడుతున్నారు. ఇక ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజలు కట్టుకోలేనంత, తట్టుకోలేనంతగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదు. తల్లిదండ్రులు ధర్నాలు చేసినా, ఫీజలు భారం నుంచి తప్పించడం లేదు. జీవితమంటే చదువులు, మార్కులు, ర్యాంకులే అన్న విధంగా విద్యారంగం తయారయ్యింది. ప్రైవేట్ మాఫియాలో అసలు విద్య గంగలో కలసిపోతోంది. ర్యాకులే విజయానికి కొలమానాలుగా మారాయి. నేటి విద్యావిధానం మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది. పిల్లల ప్రతిభను ఈ కొలమానంతో కొలవడం దారుణం. ర్యాంకుల వేటలో పిల్లల మానసిక ఒత్తిడిని పెంచుతున్నారు. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్యగా మారింది. చదివేది, పరీక్షలు రాసేదీ విద్యార్థులైతే, వాటి ఫలితాల కోసం ఎదురు చూసేది, వారి భవితపై అంచనాలు పెంచుకునేది వారి తల్లిదండ్రులు. వారి ర్యాంకులతో వ్యాపారం చేసేది ఆయా విద్యాసంస్థలు. ఈ ఒత్తిళ్ల మధ్య చదువులు, ర్యాంకుల వాతావరణానికి తోడు రకరకాల ఆర్థిక, సామాజిక, వివక్షల వంటి అనేక కారణాలు విద్యార్థుల్లో విపరీతమైన మానసిక సమస్యలను సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాల ను, విద్యాసంస్థల ఒత్తిళ్లను తట్టుకోలేక కుంగుబాటుతో, నిస్సహాయతతో కొందరు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా వచ్చిన ఇంటర్ ఫలితాల అనంతరం పదుల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పరీక్షల్లో ఫెయిలైతే జీవితం ముగిసిపోయినట్లే అన్న భావనలో..ఆత్మహత్యలే శరణ్యమని భావిస్తున్నారు. జీవితంలో చదువు, కెరీర్ ఒక భాగం మాత్రమే. అని వారికి అవగాహన కల్పించడం లేదు. మంచిచెడుల విచక్షణను తెలియజెప్పడం లేదు. ఇంటర్ ఫలితాలు వచ్చాక ఇటీవల తెలంగాణలో ఒక్క రోజులోనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే, ఎపి లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలొచ్చిన ప్రతిసారీ చిన్నారుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా ఫ్యాక్టరీలు ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా మార్చుతున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలకు హద్దు లేకుండా పోతోంది. వారి అంచనాలను అందుకోలేక మరొకరితో పోల్చడాన్ని తట్టుకోలేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి కేవలం పిల్లల వ్యక్తిగత వైఫల్యాల ఫలితం కాదు. సమాజం, విద్యావ్యవస్థలోని లోపాలను ప్రతిబింబిస్తోంది. సుప్రీంకోర్టు సైతం ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం అని వ్యాఖ్యానించిందంటే.. పరిస్థితి తీవ్రత ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడిలో వున్న పిల్లలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. వారికి మానసిక స్టయిర్యాన్ని ఇవ్వడం ముఖ్యం. మార్కులు, ర్యాంకుల కోసమే పుట్టలేదన్న విషయం పిల్లల్లో నూరిపోయాలి. ఫెయిలైతే మళ్లీ చదువుకునేందుకు అవకాశం ఉంది. అసలు చదువే ఇష్టం లేకపోతే అభిరుచి వున్న మరో రంగంలో సత్తా చాటడానికి విశాల ప్రపంచం ఉంది. తరగతి గదిలో వెనకబడిన వారు జీవితంలో అద్భుతాలు సాధించిన ఘటనలు అనేకం చరిత్రలో వున్నాయి. సచిన్ టెండూల్కర్, ధోనీ వంటి ప్రముఖ క్రికెటర్లు హైస్కూల్ చదువులతోనే సరిపెట్టుకున్నారు. ఇప్పుడు పేరున్న వారంతా అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎదిగినవారే. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, పదిలో ఫెయిల్ అయ్యామనో తనువు చాలిస్తే భవిష్యత్‌లో దేశం ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినట్టే. మన శ్రమతో కొత్త చరిత్రను లిఖించాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే విద్యారంగంలో సంస్కరణలు ముఖ్యం. ర్యాంకుల గోల, ఫీజులు గోల పోయేలా ప్రభుత్వరంగంలో స్కూళ్లను, కాలేజీలను బలోపేతం చేయాలి. ఒకేతరహా విద్య అందరికీ అందేలా చేయాలి. ముఖ్యమంగా ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి. లక్షల్లో ఫీజులు వసూళ్ల దందాను ఆపాలి. అలాగే ర్యాంకుల చదవులను ఆపాలి. పలు తరహాల సిలబస్‌లకు బ్రేక్ వేయాలి. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి, టీచర్లను నియమిస్తే..పేదలు కార్పోరేట్ స్కూళ్ల మోజులో పడరు. వాటి వెనకాల పరుగెత్తరు. ఇది గుర్తించి ఉమ్మడి ఎపిలో ప్రభుత్వాలు చర్యలకు ఉపక్రమించాలి.



# కాల్పుల విరమణ పొడిగింపు

## ట్రంప్ సంచలన నిర్ణయం!

- పాకిస్థాన్ విన్నపంతో వెనక్కి తగ్గిన అగ్రరాజ్యం..
- స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన
- ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అధ్యక్షుడు



**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాత్కాలికంగా తెరదించారు. ఇరాన్‌తో ముగియనున్న కాల్పుల విరమణ గడువును పొడిగిస్తున్నట్లు ప్రకటించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. అయితే, ఈ నిర్ణయం వెనుక పెద్ద వ్యూహమే దాగి ఉంది. ఇరాన్ నాయకత్వం నుండి ఒక సమగ్రమైన, స్పష్టమైన ప్రతిపాదన వచ్చే వరకు మాత్రమే ఈ వెసులుబాటు ఉంటుందని ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతా ద్వారా స్పష్టం చేశారు. అసలు అమెరికా ఈ నిర్ణయం ఎందుకు తీసుకుంది? దీని వెనుక పాకిస్థాన్ జరిపిన రాయబారం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పాక్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన అభ్యర్థన మేరకు.. సైనిక చర్యను వాయిదా వేసి, దౌత్యపరమైన చర్చలకు మరో అవకాశం ఇవ్వాలని ట్రంప్ నిర్ణయించుకున్నారు. ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు ఉన్నాయని, వారు ఒక స్పష్టమైన నిర్ణయానికి రావడానికి సమయం కావాలన్న ఉద్దేశంతోనే ఈ పొడిగింపు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే, కాల్పుల విరమణ పొడిగించినంత మాత్రాన ఇరాన్‌కు ఊరట లభించినట్లు కాదు. ఒకవైపు యుద్ధాన్ని వాయిదా వేస్తూనే, మరోవైపు ఇరాన్‌పై 'సముద్ర దిగ్బంధనాన్ని' కఠినతరం చేయాలని ట్రంప్ తన సైన్యాన్ని ఆదేశించారు. ఇది ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీని తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. "కాల్పుల విరమణ అమల్లో ఉండగా వాణిజ్య నౌకలను లక్ష్యం చేసుకోవడం యుద్ధం చేయడంతో సమానం" అని ఆయన మండిపడ్డారు. ఈ కాల్పుల విరమణ అనేది 'అపరిమిత కాలం' కోసం కాదని, ఇరాన్ తన బాధ్యతలను నెరవేర్చడానికి ఇచ్చిన గడువు మాత్రమేనని అమెరికా ఉన్నత అధికారి ఒకరు 'యాక్సియోస్' పత్రికతో వ్యాఖ్యానించారు. ఒకవేళ ఇరాన్ నిబంధనలను ఉల్లంఘించినా, లేదా వారి ప్రాంతీయ ఉగ్రవాద సంస్థలకు మద్దతు నిలిపివేయకపోయినా ఏ క్షణంలోనైనా ఈ ఒప్పందాన్ని రద్దు చేస్తామని అమెరికా హెచ్చరించింది. మరోవైపు, అమెరికా డిమాండ్లు అతిగా ఉన్నాయంటూ పాకిస్థాన్ వేదికగా జరగాల్సిన చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ భావిస్తోంది. ఈ పరిణామాలు చూస్తుంటే, పశ్చిమాసియాలో శాంతి అనేది ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించడం లేదు.

# ఓడిపోయిన వారు షరతులు విధించలేరు!

- ట్రంప్‌కు ఇరాన్ ఘాటు కౌంటర్
- కాల్పుల విరమణ పొడిగింపు ఒక 'డ్రామా'..
- ఆకస్మిక దాడి కోసమే అమెరికా ఎత్తుగడ
- దిగ్బంధనం బాంబు దాడుల కంటే ప్రమాదకరం.. వైట్‌హౌస్ చర్చలు రద్దు!



**టెహ్రాన్:** పశ్చిమాసియా ఆకాశంలో యుద్ధ మేఘాలు మళ్లీ కమ్ముకుంటున్నాయి. శాంతి చర్చల పేరిట అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేసిన ఎత్తుగడను ఇరాన్ అంతే వేగంగా తిప్పికొట్టింది. "యుద్ధంలో ఓడిపోయిన పక్షం ఎప్పుడూ షరతులు విధించదు" అంటూ ఇరాన్ చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ట్రంప్ ప్రకటించిన కాల్పుల విరమణ పొడిగింపు వెనుక శాంతి కంటే, సైనిక కుట్ర ఎక్కువగా ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ సలహాదారు మెహదీ మొహమ్మదీ అమెరికా తీరును తీవ్రంగా ఎండగట్టారు. ట్రంప్ కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించడం కేవలం ఒక 'డ్రామా' అని ఆయన కొట్టిపారేశారు. అమెరికా సైన్యం తనను తాను సిద్ధం చేసుకోవడానికి, ఇరాన్‌పై ఆకస్మికంగా దాడి చేసేందుకు సమయం దొరకదనే ఉద్దేశంతోనే ఈ గడువు పొడిగింపు ఎత్తుగడ వేశారని ఆరోపించారు. "మాపై బాంబు దాడులు చేయడం కంటే మా నౌకలను దిగ్బంధించడం అత్యంత ప్రమాదకరం. దీనికి సైనికపరంగానే సమాధానం ఉంటుంది" అని ఆయన సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. అంతకుముందు ట్రంప్ మాట్లాడుతూ, ఇరాన్ నాయకత్వం తీవ్ర సంక్షోభంలో ఉందని ఎద్దేవా చేశారు. పాకిస్థాన్ అభ్యర్థన మేరకు దాడులను ఆపుతున్నామని చెబుతూనే, ఆ దేశ పోర్టుల దిగ్బంధనం మాత్రం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇరాన్ రోజుకు 500 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోతోందని, అక్కడ పోలీసులకు, సైన్యానికి జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదని ట్రంప్ వ్యాఖ్యానించడం ఇరాన్‌ను మరింత రెచ్చగొట్టింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో జరగాల్సిన రెండో విడత శాంతి చర్చలు సందిగ్ధంలో పడ్డాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన పాకిస్థాన్ పర్యటనను వాయిదా వేసుకోవడం, పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటు అమెరికా తన ఆర్థిక ఆంక్షలను సడలించకపోవడం, అటు ఇరాన్ తనపై జరుగుతున్న ఈ దిగ్బంధనాన్ని యుద్ధంగా పరిగణించడంతో దౌత్య ప్రయత్నాలన్నీ విఫలమయ్యేలా కనిపిస్తున్నాయి. రాబోయే కొద్ది గంటలు పశ్చిమాసియా భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. ఇరాన్ అన్నట్లుగానే సైనిక సమాధానం ఇస్తుందా? లేక అంతర్జాతీయ ఒత్తిడికి తలొగ్గి చర్చలకు వస్తుందా? అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.

# భారత్ జోలికొస్తే 'డాట్.. డాట్.. డాట్'

- పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ సింగ్ వార్నింగ్!
- జర్మనీ వేదికగా రక్షణ మంత్రి ఘాటు వ్యాఖ్యలు..
- పశ్చిమాసియా సంక్షోభంపై స్పందన.. మధ్యవర్తిత్వానికి భారత్ సిద్ధం



**ఢిల్లీ, ఏప్రిల్22:** "భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుంది.. ఏ దేశంపై కూడా ముందుగా దాడి చేసిన చరిత్ర మనకు లేదు. కానీ, ఒకవేళ ఎవరైనా మన దేశాన్ని ప్రమాదంలో పడేయాలని చూస్తే మాత్రం, ఆ తర్వాత మా ప్రతిస్పందన ఎలా ఉంటుందో ఆ 'డాట్.. డాట్.. డాట్' లోనే అర్థం చేసుకోండి." జర్మనీ వేదికగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు పొరుగు దేశం పాకిస్థాన్‌కు వణుకు పుట్టిస్తున్నాయి. పేరు ప్రస్తావించకుండానే ఆ 'ఒక్క దేశం' తీరును ఆయన ఎండగట్టిన తీరు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. పహల్గాం ఉగ్రదాడి జరిగి నేటితో ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని జర్మనీలో ఏర్పాటు చేసిన సభలో రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. భారత సైనిక వ్యవస్థ గతంలో కంటే ఇప్పుడు ఎంతో దృఢంగా మారిందని, ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైన్యం చూపిన ప్రతాపం ప్రపంచానికి తెలుసని గుర్తు చేశారు. పొరుగు దేశాలన్నీ భారత్‌తో సఖ్యంగా ఉన్నాయని, కానీ ఆ ఒక్క దేశం మాత్రం నిరంతరం సమస్యలు సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది ఏప్రిల్ 22న పిరికిపందలు జరిపిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులకు ఆయన ఘన నివాళులర్పించారు. ఆ దెబ్బను జాతి ఎప్పటికీ మర్చిపోదని, బాధిత కుటుంబాలకు భారత్ అండగా ఉంటుందని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా భరోసా ఇచ్చారు. ఇదే వేదికగా ప్రపంచాన్ని కుదిపేస్తున్న పశ్చిమాసియా ఉద్రిక్తతలపై కూడా రాజ్‌నాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న పరిస్థితులు సద్దుమణగాలని భారత్ ఆకాంక్షిస్తోందని తెలిపారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ ఇరు దేశాధినేతలతో మాట్లాడారని, శాంతి చర్చల కోసం అవసరమైతే మధ్యవర్తిత్వం వహించేందుకు కూడా భారత్ సిద్ధంగా ఉందని ప్రకటించారు. అగ్రరాజ్యాల మధ్య సయోధ్య కుదిర్చే సత్తా భారత్‌కు ఉందని ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

# అన్ని మతాలకు ఒకే నియమం వర్తించదు

- శబరిమల కేసు విచారణలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- మత స్వేచ్ఛపై ఆసక్తికర చర్చ
- రాజ్యాంగ నైతికతపై న్యాయస్థానం విశ్లేషణ



**ఢిల్లీ, ఏప్రిల్ 22:** శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం, మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వ జోక్యంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు.. మత స్వేచ్ఛ, రాజ్యాంగ పరమైన హక్కుల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాన్ని స్పష్టం చేస్తున్నాయి. మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వం ఎంతవరకు జోక్యం చేసుకోవచ్చనే అంశంపై ముందస్తుగా ఎలాంటి ఉమ్మడి లేదా సార్వత్రిక నిబంధనలను విధించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మత స్వేచ్ఛ, సామాజిక సంస్కరణల మధ్య సమతుల్యత అనేది ఆయా కేసుల వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యంపైనే ఆధారపడి ఉంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ విచారణ కేవలం శబరిమలకే పరిమితం కాకుండా, మసీదుల్లోకి మహిళల ప్రవేశం, పార్శీ మహిళల హక్కుల వంటి ఇతర మతపరమైన అంశాలను కూడా స్పృశిస్తోంది. ఒక మతానికి చెందిన ఆచారం లేదా నిబంధనను ప్రాతిపదికగా తీసుకుని, అదే సూత్రాన్ని అన్ని మతాల ఆచారాలకు వర్తింపజేయడం సాధ్యం కాదని ధర్మాసనం పేర్కొంది. తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కీలక అంశాలపై స్పష్టతనిచ్చింది. ఆర్టికల్ 25 ప్రకారం పౌరులకు ఉన్న మత స్వేచ్ఛను గౌరవిస్తూనే, అవసరమైన చోట సామాజిక సంస్కరణల కోసం ప్రభుత్వం జోక్యం ఏ మేరకు ఉండాలనేది న్యాయస్థానం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రభుత్వ జోక్యంపై ముందస్తుగా గైడ్‌లైన్స్ జారీ చేయడం వల్ల భవిష్యత్తులో వచ్చే వివిధ కేసుల విచారణకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని ధర్మాసనం భావించింది. మతపరమైన హక్కులు 'రాజ్యాంగ నైతికత'కు లోబడి ఉండాలా లేదా అనే కీలక ప్రశ్నపై ఈ విచారణ కొనసాగుతోంది. ఏడో రోజు విచారణ ద్వారా సుప్రీంకోర్టు మతపరమైన విషయాల్లో న్యాయవ్యవస్థ, ప్రభుత్వ పరిధులను అత్యంత జాగ్రత్తగా విశ్లేషిస్తోంది. శబరిమల తీర్పును పున:సమీక్షించే క్రమంలో వెలువడే ఈ నిర్ణయాలు భారతదేశంలోని అన్ని మతాల ఆచార వ్యవహారాలపై సుదూర ప్రభావం చూపే అవకాశం ఉంది. తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనం తీసుకునే నిర్ణయం మతపరమైన హక్కుల విషయంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుంది.

చురకలు
బుధవారం 22 ఏప్రిల్ 2026

# అక్రిడిటేషన్ ముసుగులో దోపిడి..

## విలేకరుల వృత్తి గౌరవం ఎక్కడ?

(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)




ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలిచే మీడియా వ్యవస్థలోనే విలేకరుల బతుకు ఇంత అస్థిరంగా, అవమానకరంగా మారడం కాలానుగుణ వ్యతిరేక ధోరణి. అక్రిడిటేషన్ అనే గుర్తింపు, వృత్తి గౌరవానికి ప్రతీకగా ఉండాల్సింది.. ఇప్పుడది కొంతమంది పత్రిక యాజమాన్యాల చేతుల్లో డబ్బు వసూలు చేసే సాధనంగా మారిపోవడం అత్యంత ఆందోళనకరం. జర్నలిస్టుల కష్టపడి సాధించిన హక్కులు, వారి సేవలు, వారి నిబద్ధత ఇవన్నీ పక్కన పెట్టి అక్రిడిటేషన్‌ను ఒక వ్యాపార ఒప్పందంగా మార్చడం మీడియా రంగం నైతిక పతనాన్ని స్పష్టంగా చూపిస్తోంది.

ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో అక్రిడిటేషన్ కార్డులు నేరుగా అమ్మకానికి పెట్టబడుతున్నాయనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. రూ.25,000 నుంచి రూ.30,000, రూ.40,000 వరకు డబ్బులు వసూలు చేస్తూ అక్రిడేషన్ కార్డులు ఇవ్వడం, అర్హత ఉన్నవారిని పక్కన పెట్టి డబ్బు చెల్లించే అనర్హులకు కూడ అక్రిడిటేషన్ ఇవ్వడం.. ఇవి కేవలం అవినీతి చర్యలు మాత్రమే కాదు, మీడియా వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పాడుచేసే ప్రమాదకర పరిణామాలు. అక్రిడిటేషన్ ఒక విలువైన గుర్తింపు నుంచి, డబ్బుతో కొనుగోలు చేసే "సర్టిఫికేట్"గా దిగజారడం వల్ల నిజమైన జర్నలిజం తీవ్రంగా దెబ్బతింటోంది.

ఇదే సమయంలో యాజమాన్యాలు విధిస్తున్న షరతులు మరింత విచిత్రంగా మారాయి. పత్రికకు ఏడాది చందా తప్పనిసరి, నిర్దిష్టంగా ప్రకటనలు తీసుకురావాలి, పాత బకాయిలు చెల్లించాలి, ముందస్తు డబ్బులు ఇవ్వాలి.. ఇలా విలేకరులను ఆదాయ వనరులుగా మార్చి, వృత్తి స్వాతంత్ర్యాన్ని పూర్తిగా హరించే పరిస్థితి నెలకొంది. ఇది కేవలం ఆర్థిక దోపిడి మాత్రమే కాదు.. విలేకరుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యవస్థాత్మక ఒత్తిడి.

మరింతగా, కొంతమంది స్టాఫ్ రిపోర్టర్లు యాజమాన్యాల ఆదేశాలతో తమ కింద పనిచేసే విలేకరుల అక్రిడిటేషన్ కార్డులను తమ వద్దే ఉంచుకొని, డబ్బులు చెల్లిస్తేనే ఇవ్వడం వంటి బ్లాక్‌మెయిల్ చర్యలకు దిగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇది వృత్తి స్వేచ్ఛకు నేరుగా ముప్పు. ఒక విలేకరి తన గుర్తింపు కార్డు కోసం కూడా యాజమాన్యానికి డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడితే, అతను ప్రజల కోసం ఎలా స్వేచ్ఛగా పని చేయగలడు అనే ప్రశ్న తలెత్తుతుంది.

ఈ దోపిడీ కేవలం అక్రిడిటేషన్ వరకే పరిమితం కాలేదు. చాలా మంది విలేకరులు నెలకు స్థిరమైన జీతం లేకుండా, ప్రకటనలపై ఆధారపడి జీవించాల్సిన పరిస్థితిలో ఉన్నారు. వారు తెచ్చే ప్రకటనల శాతం మీదే వారి ఆదాయం ఆధారపడుతోంది. అంటే, వార్తలు రాయడం కంటే ప్రకటనలు తెచ్చే బాధ్యత ఎక్కువగా మారింది. ఇది జర్నలిజం యొక్క ప్రాథమిక లక్ష్యాన్ని పూర్తిగా వక్రీకరిస్తోంది.

ఇక భద్రతా అంశం కూడా పెద్ద సమస్యగా మారింది. విలేకరులు ఎటువంటి ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారు. ప్రమాదాల సమయంలో బీమా లేదు, అనారోగ్యానికి వైద్య సహాయం లేదు, వృద్ధాప్యంలో పెన్షన్ లేదు. ప్రభుత్వం తరచూ హామీలు ఇస్తున్నా.. ఇంటి స్థలం, హెల్త్ కార్డు, పెన్షన్ వంటి ప్రయోజనాలు.. అవి ఎక్కువగా మాటలకే పరిమితం అవుతున్నాయి. అమలు లేకపోవడం వల్ల జర్నలిస్టుల జీవితం నిరాశతో నిండిపోతోంది.

ఇంకా ఒక గమనించదగ్గ విషయం.. జర్నలిస్టులు ఈ వృత్తిని వదిలి వెళ్లలేని పరిస్థితి. 20, 30 ఏళ్లుగా ఈ రంగంలో ఉన్న వారు "ఇంకా ఏం పని చేస్తాం?" అనే అనిశ్చితిలోనే కొనసాగుతున్నారు. అధికారుల నుంచి, ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చే మర్యాద, గుర్తింపు ఒక మానసిక బంధంగా మారి, వృత్తి బంధనాల నుంచి బయటపడనీయకుండా చేస్తోంది. ఇది ఒక రకంగా మానసిక దాస్యమే.

ఈ మొత్తం పరిస్థితిని లోతుగా పరిశీలిస్తే, ఇది వ్యక్తిగత సమస్య కాదు.. వ్యవస్థాత్మక సంక్షోభం. మీడియా యాజమాన్యాలు జర్నలిస్టులను ఉద్యోగులుగా కాకుండా ఆదాయ వనరులుగా చూస్తున్నాయి. ప్రభుత్వం జర్నలిస్టులను రక్షించాల్సిన బాధ్యతను పూర్తిగా నిర్వర్తించడం లేదు. జర్నలిస్టులు సంఘటితంగా పోరాడే స్థాయిలో కూడా లేకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది.

ప్రజాస్వామ్యంలో మీడియా బలహీనపడితే, ప్రజల స్వరమే బలహీనమవుతుంది. జర్నలిస్టు స్వేచ్ఛ లేకపోతే, నిజం వెలుగులోకి రాదు. అక్రిడిటేషన్ వ్యవస్థను పారదర్శకంగా మార్చి, దోపిడీకి తావులేకుండా చేయడం అత్యవసరం. జర్నలిస్టులకు కనీస వేతనం, భద్రత, సామాజిక రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా గుర్తించాలి. యాజమాన్యాలు తమ బాధ్యతను నైతికంగా నిర్వర్తించాలి.

లేకపోతే, "వార్తల కోసం పోరాడే వారు" తామే బతుకు బండి కోసం పోరాడే దశలోనే మిగిలిపోతారు. జర్నలిస్టు గౌరవం కాపాడితేనే ప్రజాస్వామ్యం గౌరవం నిలుస్తుంది. లేదంటే, అక్రిడిటేషన్ కార్డులు మాత్రమే ఉంటాయి.. అవి కూడా డబ్బుతో కొన్న గుర్తింపులుగా మారిపోతాయి.

# అక్రెడిటేషన్ల జారీలో సర్కారు అట్టర్ ఫ్లాప్

- పాత్రికేయుల సమస్యలపై సమిష్టి పోరాటం
- టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య

**మహబూబ్ నగర్, ఏప్రిల్ 22:**



జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య విమర్శించారు. జర్నలిస్టులకు ఇవ్వాల్సిన కొత్త అక్రెడిటేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు గడిచినా కనీసం అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేక పోయిందని ఆయన ధ్వజమెత్తారు. బుధవారం మహబూబ్ నగర్ లోని కెమిస్ట్ డ్రగిస్ట్ భవన్ లో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టుల పట్ల గతంలో ఎన్నడూ లేని వధంగా ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్యం కొనసాగుతుందని అన్నారు. గడిచిన రెండేళ్లలో జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని, అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం అనేది మాటల్లోనే తప్ప చేతల్లో కనిపించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులిస్తామన్న ముఖ్యమంత్రి హామీ ఏమయ్యిందని ఆయన ప్రశ్నించారు. జర్నలిస్టుల ఇళ్ళస్థలాల ఊసే లేదని, చిన్న మధ్య తరహా పత్రికలకు రెఃడేళ్ళుగా అడ్వర్టైజ్మెంట్ల బిల్స్ ఇవ్వడంలేదని అన్నారు. ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టి ఐక్యంగా హక్కులను సాధించుకోవాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వాకిట అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కో-కన్వీనర్లు బండి విజయ్ కుమార్, ఎం. యాదగిరి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ మోయిజ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మహ్మద్ రఫీ, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ నర్సింహ్మా, కార్యదర్శి ఎం. గోపాల్, కోశాధికారి నర్సింహులు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ ఎం. రవి కుమార్, కో-కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మంలో పోటు రంగారావును రెండున్నర గంటల పాటు ప్రశ్నించిన ఎన్ఐఏ అధికారులు

**ఖమ్మం , ఏప్రిల్ 22 :**

మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావును బుధవారం ఖమ్మం లోని పార్టీ కార్యాలయం రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో

నలుగురు ఎన్ ఐ ఏ అధికారులు పలు ప్రశ్నలు సంధిస్తూ ... సుమారు రెండున్నర గంటల పాటు విచారణ నిర్వహించినట్లు పోటు రంగారావు ప్రకటించారు. విద్యాభ్యాసం ,వివాహం, సంతానం , గాదె ఇన్నయ్య తో సంబంధాలు పై ఎన్ఐఏ అధికారులు ప్రశ్నలు సంధించారు. హెడ్మాతల్లి ఓదార్చిన అంశంలో .... ఆర్థిక సహాయం పై , నిషేధిత పార్టీల తో విభేదాలపై , కగార్ ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారు ? ఎన్ఐఏ పట్ల సమాజంలో భయాందోళనలను ఎందుకు రేకెత్తిస్తున్నారు? కగార్కు వ్యతిరేకంగా నిరసనల కార్యక్రమం చేపట్టారు ? అంటూ ప్రశ్నించినట్లు అందిన సమాచారం. అధికారులు పోటు రంగారావును ప్రశ్నిస్తున్నట్లు సమాచారం అందుకున్న పార్టీ నాయకులు, కొంతమంది లాయర్లు పార్టీ కార్యాలయంకు చేరుకున్నారు.

## జనగణన పారదర్శకంగా నిర్వహించాలి

**తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ భారతి హోలీకేరి**

**చేగుంట, ఏప్రిల్ 21:**

మెదక్ జిల్లా, చేగుంట మండలంలోని వడియారంలో నిర్వహించిన జనగణన శిక్షణ ముగింపు కార్యక్రమానికి జనగణన తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ భారతి హోలీకేరి, మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనగణన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి చిన్న అంశం రికార్డు అయ్యేలా చూడాలని సూచించారు. ఎనిమరేటర్లు, సూపర్‌వైజర్లు సేకరించే సమాచారం రాబోయే తరాల ప్రణాళికలకు ఎంతో కీలకంగా మారుతుందని, ప్రజలు ఇచ్చే సమాచారానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఎటువంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు.



హౌస్ లిస్టింగ్ ప్రక్రియపై పలు సూచనలు చేస్తూ, క్షేత్రస్థాయిలో ఎనిమరేటర్లు ఎదుర్కొనే సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి, చేగుంట చార్జ్ ఆఫీసర్ శివప్రసాద్, ఏఎస్ఓ చార్జ్ ఆఫీసర్ భూమేష్, ఫీల్డ్ ట్రైనర్లు చల్లా లక్ష్మణ్, జంగం మల్లేశం, ఎనిమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## చెరువు నుండి నీరు పోయే ధోనీ నిర్మాణం కోసం ఇరిగేషన్ అధికారుల అంచనా పరిశీలన

**స్పందించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపిన సర్పంచ్**



**పెద్దపల్లి, ఏప్రిల్ 22:** పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రైతుల పంట పొలాల కోసం చెరువు నుండి నీరు పారే ధోనీ (కాలువ/తూము) శిథిలావస్థకు చేరి ఆయకట్టు రైతులకు పెద్ద సమస్య గా మారిందని సర్పంచ్ పేర్క రిబ్కా సంతోష్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ కు ఇటీవల వినతిపత్రం అందజేశారు. సకాలంలో స్పందించిన ఇరిగేషన్ ఏ ఈ లు శివ, పవన్ బుధవారం ధోని (కాలువ) ను సర్పంచ్ తో కలిసి పరిశీలించారు. ధోనీ పునరుద్ధరణ , రోడ్డు డ్యాం నిర్మాణం చేసి ప్రక్కకు కాలువ నిర్మిస్తే బాగుటుందని నీటి పారకం అలాగే దారి ఏర్పాటు అయ్యే అవకాశం ఉంటుందని సర్పంచ్ వివరించారు. దీనివల్ల రైతులకు, ప్రక్క గ్రామం మూలసాలకు వెళ్లేందుకు కూడా సులువు అవుతుందని తెలిపారు. ధోనీ నిర్మాణం కోసం సకాలంలో స్పందించిన ఇరిగేషన్ అధికారులకు సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ ఉన్నారు.

## వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సుడా చైర్మన్



**కరీంనగర్, ఏప్రిల్ 22 :** కరీంనగర్ రూరల్ మండలం నగునూరు, ఏలబోతారం, చామన్ పల్లి,బహదూర్ఖాన్ పేట్, దుబ్బపల్లి, చర్లభూత్కూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసిందని నరేందర్ రెడ్డి తెలిపారు. గత వారం రోజులుగా ధాన్యం వస్తుందని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన వెంటనే తూకం ప్రారంభించి మిల్లులకు ధాన్యం తరలించే వరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో ఏపీఎం రామ్మోహన్, పిఎసిఎస్ సిఈవో రమేష్, సిసి లు రాజేశం, కృష్ణ, అశోక్ ఆయా గ్రామాల సర్పంచులు సాయిల్ల శ్రావణి, తప్పట్ల రాజు, బోగొండ అయిలయ్య, గుర్రంసంధ్య తిరుపతి రెడ్డి, మోతె ప్రశాంత్ రెడ్డి, కూర నరేష్ రెడ్డి, సుద్దాల కమలాకర్, బొద్దుల విజయ లక్ష్మి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరుగాలం కష్టపడ్డ రైతును అగ్రభాగానా నిలుపడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**మంథని ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న**



**మంథని, ఏప్రిల్ 22:** ఆరుగాలం కష్టపడి పంట సాగుచేసిన రైతును అగ్రభాగాన నిలుపడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంథని ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఖాన్ సాయిపేట్, వెంకటాపూర్, మల్లారం, స్వర్ణపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంథని ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న సర్పంచులు మెరుగు సురేష్, తోటపల్లి పోచయ్య, పొట్ల లక్ష్మి(శ్రీకాంత్), గుమ్మడి సమ్మయ్య లతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంథని ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్ని వర్గాల ప్రజలతో పాటు దేశానికి అన్నం పెట్టే రైతన్న కోసం దేశం గర్వించే రీతిలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి ఇబ్బంది పడకుండా ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, నాయకులు ఎలిగేటి నరేష్,దొరగొర్ల స్వప్న, రెండ్ల స్రవంతి - కృష్ణమూర్తి, కొండ మహేందర్, కుడుదుల సత్యనారాయణ, మహదేవ్, సంతోష్, కీర్తీ సాయి, బెజ్జంకి చిన్న మల్లయ్య, మానేం రాజేందర్, లచ్చన్న, లింగయ్య, సుంకరి బాపు, పొట్ల రవి, కాశీపేట వెంకటస్వామి, రైతులు, ప్రజాప్రతినిధులు, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చురకలు గురువారం 23 ఏప్రిల్ 2026

# ఆర్టీసీ సమ్మె సమయంలో హింసకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు....

- ప్రజా రక్షణ, శాంతి భద్రతకే ప్రాధాన్యం: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- ఉద్యోగం కోసం వచ్చే డ్రైవర్లు, కండక్టర్లకు పూర్తి భద్రత



**గోదావరిఖని, ఏప్రిల్ 22:** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి మంచిర్యాల జోన్ పరిధిలో శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మె సమయంలో విధుల్లో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న ప్రైవేట్ డ్రైవర్లు, కండక్టర్లు, అలాగే బస్సుల యజమానులను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు దాడులు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, ఇళ్లపై దౌర్జన్యాలకు దిగడం వంటి ఘటనలను పోలీసులు అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి చర్యలు చట్ట విరుద్ధమని, పాల్గొన్న ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించబడతారని హెచ్చరించారు. ప్రజలు ఎవరూ భయపడకుండా తమ విధులు నిర్వర్తించాలనీ, ఉద్యోగం కోసం వచ్చే వారికి పూర్తి రక్షణ కల్పిస్తామని పోలీసులు భరోసా ఇచ్చారు. ఎవరైనా బెదిరింపులు, దాడులకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర సహాయం కోసం రామగుండం పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్: 87126 56597, డయల్ 100 కాల్ చేయండి అని తెలిపారు. పోలీసులు ఎల్లప్పుడూ ప్రజల రక్షణ కోసం సిద్ధంగా ఉన్నారని, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే వారిని ఏమాత్రం ఉపేక్షించబోమని కమిషనర్ తెలిపారు.

# గన్నేరువరం మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**గన్నేరువరం:** గన్నేరువరం మండల కేంద్రంలో బుధవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి గన్నేరువరం కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు ముస్కు ఉపేందర్ రెడ్డి గన్నేరువరం సర్పంచ్ లచ్చి నర్సు రైతులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాతంగి అనిల్ ఈ కార్యక్రమంలో చింతల శ్రీధర్ రెడ్డి బుర్ర తిరుపతి గౌడ్ బూరవెంకటేశ్వర్లు పాకాల పరశురాం శ్రీకాంత్ గౌడ్ బుర్ర మల్లేష్ గౌడ్ రైతులు తదితరులు పాల్గొన్నారు

# రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రాయించాలి - పులి క్రిష్ణ చైర్మన్ మార్కెట్ కమిటీ



**బెజ్జంకి:** బెజ్జంకి మండలంలోని దేవక్కపల్లి,తోటపల్లి, వీరాపూర్,గాగిల్లాపూర్ గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ పులిక్రిష్ణ ఆయా గ్రామాల సర్పంచ్ లతో కలిసి ప్రారంభించారు.రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రాయించాలని, మద్దత్తు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు ఎర్రల జానకి రాజు,చిలుముల సతీష్,కవ్వంపల్లి అశ్విని శ్రీనివాస్,నేరెళ్ల వెంకటలక్ష్మీ రాజయ్య,తదితరులు పాల్గొన్నారు.

# రేగులపల్లి లో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**, బెజ్జంకి:** మండలంలోని రేగులపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ జంగిలి లక్ష్మీ తిరుపతి తో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్ మండల అధ్యక్షులు రత్నాకర్ రెడ్డి లతో కలసి ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని 6 నెలలు కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మి నష్టపోవద్దని తెలిపారు.ఈ కార్యక్రమములో ఏఎంసి వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, సీసీ తిరుపతి,గ్రామ శాఖ అధ్యక్షుడు జీల లింగం,వార్డు సభ్యులు గ్రామ రైతులు పాల్గొన్నారు

# విద్యార్థి దశలో కష్టపడితే జీవితమంతా సుఖ సంతోషాలే

- మంథని పేరును విశ్వవ్యాప్తం చేయాలి
- మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్
- ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించిన మున్సిపల్ పాలకవర్గం



**మంథని, ఏప్రిల్ 22:** విద్యార్థి దశలో ఏకాగ్రతతో ఇష్టపడి చదువుకుంటే, జీవితమంతా సంతోషమయంగా ఉంటుందని మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ అన్నారు. మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించి కళాశాల స్థాయిలో ప్రథమ ద్వితీయ ర్యాంకులు సాధించిన గుండోజు శ్రీజ, పెండ్యాల శ్రీనిధి, ప్రైవేట్ కాలేజీలో చదివిన కొండ్ర అశ్విత్ గౌడ్ లను మంథని మున్సిపల్ పాలకవర్గం తరపున మంథని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాలకమండలి సభ్యులు అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను ఆయుధంగా మల్చుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హితవు పలికారు. ఉన్నత చదువులు చదివేందుకు, జీవితంలో స్థిరపడేందుకు ఇంటర్మీడియట్ రెండవ మెట్టు అని అన్నారు. ఆరంభంలోనే తప్పటడుగు వేస్తే అది భవిష్యత్తును దెబ్బతీస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా వార్షిక పరీక్షలకు,పోటి పరీక్షలకు అన్ని విధాలా సంసిద్ధులు కావాలని సూచించారు. ఇదివరకటితో పోలిస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనేక వసతులు అందుబాటులోకి వచ్చాయని, ప్రభుత్వం కూడా పేద విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అనేక విధాలుగా తోడ్పాటును అందిస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. ఇతర వ్యాపకాల వైపు దృష్టి పడకుండా విలువైన సమయాన్ని చదువుకోవడానికి కేటాయించాలన్నారు. మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మంథని నియోజకవర్గం సరస్వతీ నిలయంగా మారిందన్నారు. గుండోజు శ్రీజ, పెండ్యాల శ్రీనిధి,కొండ్ర అశ్విత్ గౌడ్ లు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించి మంథని పేరును విష్వవ్యాప్తం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎన్ మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలక సభ్యులు నూకల కమల్, మాచిడి రాజు గౌడ్, మద్దికట్ల స్రవంతి, పోతరబోయిన శ్రీలత, మారుపాక నిహారిక, పెంటరి రాజు, వేముల లక్ష్మి, యేల్లంకి వంశీధర్, విద్యార్థుల తల్లిదండ్రులు పెండ్యాల రామ్ కుమార్, గుండోజు భాస్కర్, కొండ్ర నాగరాజు లు పాల్గొన్నారు.

# సుడా పనుల పై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసి కొత్త పనులకు టెండర్లు ఖరారు చేయాలని అధికారులను ఆదేశించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ ప్రఫుల్ దేశాయ్



**కరీంనగర్, ఏప్రిల్ 22:** సుడా పనులపై సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సుడా వైస్ చైర్మన్ మరియు మున్సిపల్ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని కొత్త పనులకు టెండర్లు పిలవడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.సుడా కమర్షియల్ బిల్డింగ్ మొదటి విడత పనులు చివరి దశకు వచ్చాయని ఆది పూర్తి కాగానే మిగతా పనులకు టెండర్లు పిలవాలని రాజీవ్ చౌక్ లో నూతనంగా ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహం మరియు రాజీవ్ చౌక్ సుందరీకరణ పనులు ఐడిఎస్ఎంటి మరియు వర్టికల్ గార్డెన్లు తదితర పనులను మే 21 లోగా పూర్తి చేయాలని మే 21 న రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ముఖ్య అతిథులచే ప్రారభించుకుందామని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ శివానంద్, డిఈఈలు రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్వర్లు ఎఈఈ లు సతీష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.. మంత్రి లక్ష్మణ్ కుమార్..

ఇస్రాజ్ పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి అడ్లూరి..



**గొల్లపల్లి, ఏప్రిల్ 22:** ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లె గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని మంత్రి అన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో తప్ప తాలు పేరుతో క్వింటాల్ కు నాలుగు నుంచి ఐదు కిలోల వరకు కోతల విధించేవారని మంత్రి అన్నారు. మధ్యవర్తుల దోపిడీ లేకుండా రైతులకు నేరుగా లాభం చేకూరే విధంగా కొనుగోలు కేంద్రాల్లో చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.




# అడ్మిషన్లు పెంచేలా కృషి చేయాలి..

- రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ ను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి..
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, ఏప్రిల్ 22:** నగునూరు లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కాలేజ్‌లో ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు మరింత పెంచేందుకు ప్రత్యేకంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. విద్యార్థులకు ఉత్తమ విద్య, సదుపాయాలు అందిస్తూ కాలేజీని అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. బుధవారం రాత్రి కలెక్టర్ తన ఛాంబర్‌లో కాలేజీ అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాలేజీలో ఉన్న కోర్సులు, విద్యార్థుల సంఖ్య, వసతుల కల్పన తదితర వివరాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్‌లు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించి కాలేజీని అత్యుత్తమంగా నిలబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ మాలతి, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, సూపరిండెంట్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మె పట్ల మంత్రి శ్రీధర్ బాబు జోక్యం చేసుకోవాలి

బూడిద గణేష్ సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు



**మంథని, ఏప్రిల్ 22:** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కొరకు ఆర్టీసీ కార్మికులు రాష్ట్రవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగింది. బుదవారం మంథని ఆర్టీసీ డిపో కార్మికులు విధులు బహిష్కరించి గేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఆర్టీసీ కార్మికుల ఇతర సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని ఎన్నికల మేనిఫెస్టో చైర్మన్ గా ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ఉన్నారు కాబట్టి మంత్రి శ్రీధర్ బాబు వెంటనే స్పందించి ఆర్టీసీ కార్మికుల సమ్మె విషయంలో జోక్యం చేసుకొని ఆర్టీసీ సంఘాల ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు అలాగే ఆర్టీసీ యాజమాన్యం సమ్మెను విచ్చినం చేయడానికి ప్రయత్నం చేస్తుందని శిక్షణలేని డ్రైవర్లతో బస్సులు నడిపించడం వల్ల బస్సులు ప్రమాదాలకు గురవుతున్నాయని అన్నారు రాష్ట్రంలో ఏ బస్సు ప్రమాదానికి గురైన ఆర్టీసీ యాజమాన్యం,ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు ఆర్టీసీ పెద్ద సంక్షేమ రంగమని గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలు ఆర్టీసీ బస్సులోనే ప్రయాణాలు చేస్తున్నారని ఇలాంటి సేవా రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజల అందరి పైన ఉందని అన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేసి ఆర్టీసీని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్, ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చురకలు



## తాళ్లరామడుగులో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, ఏప్రిల్ 22 :**

నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం తాళ్లరామడుగు గ్రామంలో గాడ్ల ప్రమీల–రాజయ్య దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఎమ్మెల్యే డా. రేకులపల్లి భూపతిరెడ్డి చొరవతో నిజామాబాద్ రూరల్ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బకారం రవి, సర్పంచ్ వరలక్ష్మి సంతోష్, యూత్ నాయకుడు తుంపల్లి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షా లతో రైతులకు నష్టం.. పరిహారం చెల్లించాలి



**నిజామాబాద్ రూరల్ సిరికొండ , ఏప్రిల్ 22 :**

నిజామాబాద్ రూరల్ సిరికొండ మండలం తాటిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ రూరల్ ఇంచార్జి బాజిరెడ్డి జగన్ బుధవారం ప్రెస్మీట్ నిర్వహించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ముఖ్యంగా వరి పంటలు నేలపాలై రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని పేర్కొన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఒక్కసారిగా నాశనం కావడంతో తీవ్ర ఆవేదనలో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందించాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనా వేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకునేలా తగిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## ప్రతిభ రత్న అవార్డుకు డాక్టర్ బాలు ఎంపిక

**కామారెడ్డి, ఏప్రిల్ 22:**



కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఐవిఎఫ్ సేవాదళ్ సమన్వయకర్త డాక్టర్ బాలు ప్రతిష్ఠాత్మకమైన "ప్రతిభా రత్న టాలెంట్ అవార్డు–2026"కు ఎంపికయ్యారు. ఈ అవార్డును హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ జాతీయ కమిటీ ప్రకటించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును అందజేయనున్నా రు. ఈ సందర్భంగా అవార్డుకు ఎంపిక చేసిన సంస్థ జాతీయ చైర్మన్ కొంపల్లి సత్యనారాయణ, నేషనల్ ఇన్ చార్జ్ బీరెల్లి చంద్రశేఖర్ గుప్తా, ఐవిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ నీల శ్రీధర్‌కు డాక్టర్ బాలు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బాలు మాట్లాడుతూ, 2007లో కామారెడ్డి రక్తదాతల సమూహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 350కు పైగా రక్తదాన శిబిరాలు నిర్వహించి, 26 వేల యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించినట్లు చెప్పారు. అదేవిధంగా థలసేమియా బాధిత చిన్నారులకు 6 వేల యూనిట్లకు పైగా రక్తాన్ని అందించి అనేక ప్రాణాలను కాపాడినట్లు వెల్లడించారు. ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందించేందుకు భవిష్యత్తులో కూడా నిరంతరం సేవలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## ఇంధల్వాయి తండాలో 'ప్రజా బాట'.. విద్యుత్ వినియోగంపై అవగాహన

**ఇందల్వాయి, ఏప్రిల్ 22 :**

ఇందల్వాయి తండాలో బుధవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజా బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ కె.ఎస్ .ఆర్. మూర్తి పాల్గొని గ్రామస్థులకు విద్యుత్ వినియోగం, భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. నిత్యజీవి తంలో విద్యుత్ వల్ల కలిగే ప్రమాదాలు, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా వర్షాకాలంలో, వ్యవసాయ పనుల సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కరెంట్ దొంగతనం చేయడం చట్టరీత్యా నేరమని, దీనివల్ల లైన్లపై ఒత్తిడి పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశముందని హెచ్చరించారు. సర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి గ్రామంలో పర్యటించి వేలాడుతున్న తీగలు, పాడైన స్తంభాలను పరిశీలించారు. సమస్యలు ఉంటే వెంటనే తెలియజేస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ సందీప్, లైన్‌మన్ అబ్జల్, ఏఎల్ఎన్ రవి, సర్పంచ్ బాధవత్ సుదర్శన్, పంచాయతీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి


- కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- బాలికల రెసిడెన్షియల్ హాస్టల్ తనిఖీ



**దోమకొండ, ఏప్రిల్ 22 :**

క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా దోమకొండ మండలంలోని బాలికల రెసిడెన్షియల్ హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మమేకమై వారి ఆశయాలు, భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. హాస్టల్‌లో భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా అనే విషయాన్ని విద్యార్థినులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, మౌలిక వసతులు సక్రమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. హాస్టల్‌కు సీసీ రోడ్డు మంజూరైనప్పటికీ వీధి దీపాలు లేవని అధికారుల సమాచారం మేరకు, వెంటనే సంబంధిత శాఖలతో మాట్లాడి విద్యుత్ సదుపాయం కల్పించి వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పనులను గ్రామ పంచాయతీ, కలెక్టర్ నిధులతో పూర్తి చేయాలని సూచించారు. కాంపౌండ్ వాల్ దెబ్బతిన్న అంశాన్ని గమనించిన కలెక్టర్, దాని పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసయ్య, మాజీ జెడ్పిటిసి తిరుమల గౌడ్, జిల్లా కోఆర్డినేటర్ శివరాములు, ప్రత్యేక అధికారిని జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తాసిల్దార్ సుధాకర్, ఎంఈఓ విజయ్ కుమార్, ఎంపీఓ రవికుమార్, ప్రిన్సిపల్, కార్యదర్శి పాల్గొన్నారు.

# నిధుల వినియోగంపై వివాదం



**కామారెడ్డి/పాల్వంచ, ఏప్రిల్ 22 :**

పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట్ గ్రామపంచాయతీలో నిధుల వినియోగంపై వివాదం నెలకొంది. గ్రామానికి చెందిన పలువురు వార్డ్ సభ్యులు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కలిసి, సర్పంచ్ జీడిపల్లి నర్సింహా రెడ్డి పనితీరుపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. వార్డ్ సభ్యుల ప్రకారం పంచాయతీ నిధులు బాడీ మీటింగ్‌లలో చర్చించకుండా ఖర్చు చేస్తున్నారని, అధికారిక తీర్మానాలు లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అలాగే వార్డు సభ్యులను పక్కన పెట్టి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇంకా కొన్ని పాత బిల్లులు పెండింగ్‌లో ఉండగా ఎంపిక చేసిన కొంతమందికే చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. ఇది పారదర్శకతకు విరుద్ధమని వారు అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, సర్పంచ్ పదవిలోకి వచ్చిన (22 డిసెంబర్ 2025) తేదీకి ముందు జరిగిన పనులకు (2023 డిసెంబర్ మరియు 2024 ఆగస్టు) సంబంధించిన రూ. 2,67,327 బిల్లులు కూడా డ్రా చేసినట్లు వారు సందేహాలు వ్యక్తం చేశారు. ఈ విషయాలపై స్పందించిన వార్డ్ సభ్యులు, పంచాయతీ నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వ సలహాదారుని కోరారు. గ్రామ ప్రజల నిధులు సరైన విధంగా వినియోగించబడాలని, పారదర్శకత పాటించాలని వారు అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, ఈ అంశం గ్రామంలో చర్చకు దారితీసింది. అధికారుల స్పందన ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది.

## లక్ష్మారెడ్డి పదవీ విరమణకు ఘన సన్మానం



**నిజామాబాద్ రూరల్ సిరికొండ , ఏప్రిల్ 22 :**

నిజామాబాద్ రూరల్ సిరికొండ మండలం గాడ్కోల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు దువ్వూరి లక్ష్మారెడ్డి పదవీవిరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు అందించిన సేవలు, బోధనలో చూపిన నిబద్ధతను పలువురు ప్రశంసించారు. కార్యక్రమానికి ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ ముఖ్య అతిథిగా హాజరై లక్ష్మారెడ్డి సేవలను కొనియాడుతూ శాలువా కప్పి సత్కరించారు. విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలిచే ఉపాధ్యాయుల సేవలు అమూల్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొని లక్ష్మారెడ్డికి ఘనంగా వీడ్కోలు పలికారు.

## గంగారాం తండాలో భారీ చోరీ



**ఇందల్వాయి, ఏప్రిల్ 22, :**

మండల పరిధిలోని గంగారాం తండాలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితురాలు మరియు పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన శ్రీమతి నసీం సుల్తానా తన మనవడి ఆరోగ్యం బాగాలేకపోవడంతో, ఈ నెల 21వ తేదీ ఉదయం నిజామాబాద్‌కు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకున్న దొంగలు, మంగళవారం అర్ధరాత్రి ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బెడ్‌రూమ్‌లోని అల్మీరాను ధ్వంసం చేసి, అందులో ఉన్న 5 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు మరియు రూ. 20,000 నగదును ఎత్తుకెళ్లారు.బుధవారం ఉదయం బాధితురాలు ఇంటికి తిరిగి వచ్చేసరికి దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇందల్వాయి పోలీసులు కేసు నమోదు చేసి, క్లూస్ టీమ్ సహాయంతో దర్యాప్తు వేగవంతం చేశారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్.ఐ. తెలిపారు.

## మన భూమి – మన బాధ్యత



**కామారెడ్డి, ఏప్రిల్ 22:**

భిక్కనూరు మండల పరిధిలోని తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలోని జియో ఇన్ఫర్మేటిక్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ డా. సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ, "మన భూమి – మన బాధ్యత" అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. జియో ఇన్ఫర్మేటిక్స్ విభాగాధిపతి డా. సబితా మాట్లాడుతూ, "భూమిని కాపాడటం అంటే భవిష్యత్తును కాపాడినట్టే" అని అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డా. సబితా, డా. ప్రతిజ్ఞ, డా. నారాయణ గుప్తా, ఏపిఆర్ఓ డా. సరిత పిట్ల, ఉమెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వైశాలి, డా. ఇంద్రకరణ్ రెడ్డి, కనకయ్య, వెంకట్ రెడ్డి, డా. శ్రీను కేతావత్, డా. మహిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

# సంక్షేమ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష

- వారోత్సవాలపై అధికారులకు దిశానిర్దేశం

**కామారెడ్డి, ఏప్రిల్ 22 :**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సంక్షేమ వారోత్సవాల సందర్భంగా వారం రోజుల కార్యాచరణ రూపొందించామని ఆయన తెలిపారు. మొదటి రోజు జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలను మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు విస్తృతంగా తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతులు, మౌలిక సదుపాయాలను పరిశీలించినట్లు తెలిపారు. రెండవ రోజు వసతి గృహాల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్, క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారని, జిల్లా వ్యాప్తంగా 5,009 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మూడవ రోజు ఇంజనీరింగ్ అధికారులు హాస్టళ్లను పరిశీలించి, లీకేజీలు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సమస్యలపై దృష్టి సారించి మైనర్ మరమ్మతుల ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మిగతా కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసి, రోజువారీ నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లలో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన వసతులు అందించడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, ఇందులో ఎలాంటి అలసత్వం సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా షెడ్యూల్డ్ కాస్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి, జిల్లా బ్యాక్వర్డ్ క్లాసెస్ డెవలప్‌మెంట్ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, బాన్సువాడ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సిబ్బంది పాల్గొన్నారు.

# రేణుక ఎల్లమ్మ ఆశీస్సులతో సుఖశాంతులు

**కామారెడ్డి/ మాచారెడ్డి, ఏప్రిల్ 22**

మాచారెడ్డి మండలం సోమార్‌పేట గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి వార్షిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. పండుగలు, జాతరలు మన సంస్కృతి సంప్రదాయాల ప్రతిబింబాలని, వాటిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ దేవాలయాల అభివృద్ధి ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని పేర్కొన్నారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు నర్సింగరావు, నాయకులు రమేష్ గౌడ్, ఇంద్రకరణ్ రెడ్డి, గూడెం శ్రీనివాస్ రెడ్డి, నౌసి నాయక్, దేవరాజ్ గౌడ్, సుతారి రమేష్, తిరుమల గౌడ్, బల్యాల సుదర్శన్, ఐరెని నరసయ్య, రాజగౌడ్, గంప ప్రసాద్, గోనే శ్రీనివాస్ తదితర స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# ముగిసిన జనగణన శిక్షణ



**భీమ్‌గల్, ఏప్రిల్ 22 :**

జనగణన–2027లో భాగంగా భీమ్‌గల్ మండల తహసిల్దార్ కార్యాలయంలో గత మూడు రోజులుగా నిర్వహించిన తొలి విడత శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ఇన్‌చార్జ్ తహసిల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో 6 మంది సూపర్వైజర్లు, 34 మంది ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చామని వెల్లడించారు. అనంతరం సూపర్వైజర్లు, ఎన్యు మరేటర్లకు శిక్షణ సామాగ్రిని పంపిణీ చేశారు. జనగణన–2027లో భాగంగా తొలి విడతలో హౌస్‌లిస్టింగ్ మే 11 నుంచి జూన్ 9 వరకు, సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండో విడత శిక్షణ కార్యక్రమం ఏప్రిల్ 23 నుంచి ప్రారంభం కానుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డ్యూటీ అశ్విన్ బాబు, మాస్టర్ ట్రైనర్లు శేఖర్, సత్యనారాయణ, ఛార్జ్ సెన్సస్ క్లర్క్ శివ, ఉపాధ్యాయులు కర్నాల శ్రీనివాస్, రాజశేఖర్, వీరేష్ రెడ్డి, నీల శ్రీనివాస్, డి. శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

# షబ్బీర్ అలీ చేతుల మీదుగా ఆలయ మండపం ప్రారంభం

**కామారెడ్డి/ మాచారెడ్డి, ఏప్రిల్ 22 :**



మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో భక్తి వాతావరణం నడుమ పలు అభివృద్ధి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఆలయ ఆవరణలో దాతల సహకారంతో నిర్మించిన కాలక్షేప (ఆశీర్వచన) మండపాన్ని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రారంభించారు. అలాగే భక్తుల నివాసార్థం నిర్మించిన గృహాల ప్రారంభోత్సవం నిర్వహించడంతో పాటు పలు కాటేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గత సంవత్సరం శంకుస్థాపన చేసిన పనులకు ఏడాది వ్యవధిలోనే ప్రారంభోత్సవం జరగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**ఆలయ కమిటీ పదవి కాలం పొడిగింపు**

ఈ సందర్భంగా ఆలయ పాత కమిటీ అధ్యక్షులు మరియు పాలకవర్గ సభ్యుల పదవీకాలాన్ని మరో మూడు సంవత్సరాల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా శనిగరం కమలాకర్ రెడ్డి కొనసాగుతుండగా, సభ్యులుగా బండారి యాదగిరి రెడ్డి, గట్టగోని రామ గౌడ్, కొత్త కాపు రాజారెడ్డి, పాత లక్ష్మీ రాజ్యం, ఎర్రబోయిన దేవయ్య, కందాడి బాల్ రెడ్డి, కర్రోల్ల శంకర్ గౌడ్, నల్ల అంజయ్య, చింతల నర్సింలు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం మహిమగలదని, స్వామివారి అనుగ్రహంతోనే తనకు ఆలయ అభివృద్ధి చేసే అవకాశం లభించిందని తెలిపారు. మతభేదాలు లేకుండా భక్తి భావంతో సేవ చేయడం తన అదృష్టమని పేర్కొన్నారు. మండుతున్న ఎండల్లో కూడా భారీ సంఖ్యలో వచ్చిన భక్తులను స్వాగతిస్తూ, ఆలయానికి రోడ్డు మరియు విద్యుత్ సౌకర్యాలు కల్పించడం తనకు లభించిన భాగ్యమని అన్నారు. చైర్మన్ కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి విశేషంగా జరిగిందని ప్రశంసిస్తూ, అందుకే ఆయనను తిరిగి చైర్మన్‌గా నియమించామని తెలిపారు. ప్రతి ఆదివారం ఆలయం భక్తులతో కిక్కిరిసిపోతుందని, కోరికలు కోరిన వారికి స్వామివారు వరప్రదుడిగా నిలుస్తారని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధికి తాను శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు నర్సింగరావు, రమేష్ గౌడ్, ఇంద్రకరణ్ రెడ్డి, గూడెం శ్రీనివాస్ రెడ్డి, నౌసి నాయక్, దేవరాజ్ గౌడ్, సుతారి రమేష్, తిరుమల గౌడ్, బల్యాల సుదర్శన్, ఐరెని నరసయ్య, రాజగౌడ్, గంప ప్రసాద్, గోనే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విశ్వభారతి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**భీమ్‌గల్, , ఏప్రిల్ 22 :**

భీమ్‌గల్ పట్టణంలోని శ్రీ విశ్వభారతి విద్యాలయంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ నితిన్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు గ్రాడ్యుయేషన్ గౌన్లు ధరించి సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని అందంగా అలంకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, ప్రతిభను పలువురు ప్రశంసించారు. చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు. కరస్పాండెంట్ నితిన్ రాజ్ మాట్లాడుతూ చిన్న తరగతుల నుంచే గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ప్రిన్సిపల్ అపర్ణ మాట్లాడుతూ పట్టుదలతో చదివితే లక్ష్యాలు సాధ్యమవుతాయని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దొడ్డు వడ్లు తరుగు లేకుండా కొనుగోలు చేయాలి



**భీంగల్, ఏప్రిల్ 22 :**

ప్రభుత్వం, సహకార అలాగే ఐకేపీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు వడ్లను తరుగు లేకుండా కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం ఇంచార్జ్ తహసీల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులు మాట్లాడుతూ, వరి కొనుగోలు కేంద్రాల్లో కేవలం సన్న రకం ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, దొడ్డు రకానికి కొర్రీలు పెడుతున్నారని ఆరోపించారు.దొడ్డు రకం ధాన్యం కొనాలి అంటే ప్రస్తుతం ఇస్తున్న మూడు కిలోల తరుగుతో పాటు అదనంగా మరో రెండు కిలోలు రైతులు ఇవ్వాలని అయితేనే మిల్లర్లు దొడ్డు వడ్లు దించుకుంటారని చెప్పడం ఏమిటని అన్నారు.తరుగు భరిస్తేనే ఏజెన్సీలు కొనుగోలు చేస్తాయని రైతులకు కండిషన్ పెట్టడం దారుణం అన్నారు. ఐదు కిలోల తరుగు ఎలా తీస్తారని ప్రశ్నించారు. దొడ్డు వడ్లను కొనుగోలు కేంద్రాల్లో తరుగు లేకుండా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం ద్వారా ప్రభుత్వానికి కోరారు. లేకుంటే రైతుల తరపున ధర్నా, ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ నాయకులు బోదిరే నర్సయ్య, కౌన్సిలర్ నీలం రవి, మూత లింబాద్రి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతులు, తదితరులు ఉన్నారు.

# నిబంధనలు పాటించకుంటే చర్యలు

**భీమ్‌గల్, ఏప్రిల్ 22 :**



భీమ్‌గల్ మండలం పెద్దమ్మకండి తాండ గ్రామంలో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఐస్‌క్రీమ్, కారీలు విక్రయిస్తే రూ.1000 జరిమానా విధించాలని గ్రామ పంచాయతీ తీర్మానించింది. గ్రామంలో బుధవారం సర్పంచ్ భుక్య రమేష్ అధ్యక్షతన గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామాభివృద్ధి కమిటీ సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గ్రామపంచాయతీ అనుమతి లేకుండా ఐస్‌క్రీమ్, కారి బండ్లు, ఆటోలు గ్రామంలోకి ప్రవేశించకూడదని, ఇంటింటికీ తిరిగి వ్యాపారం చేయరాదని నిర్ణయించారు. నిబంధనలు అతిక్రమిస్తే రూ.1000 జరిమానా విధిస్తామని తెలిపారు. రోడ్డు భద్రతపై కూడా పలు నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్ యువకులకు వాహనాలు ఇవ్వకూడదని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదని పేర్కొన్నారు.పిల్లల ఆరోగ్యం దృష్ట్యా ఈ నిర్ణయాలు తీసుకున్నామని సర్పంచ్ భుక్య రమేష్ వెల్లడించారు. గ్రామంలో పలు చోట్ల అవగాహన కోసం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమత, ఉప సర్పంచ్ గణపతి, వార్డు సభ్యులు సంతోష్, రవి, సరిత, లలిత, సునీత, ఇతర పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## కవిత కొత్త పార్టీకి ఆశీర్వాదం ఇవ్వాలి



**మెట్‌పల్లి టౌన్, ఏప్రిల్ 22:**

కవిత ప్రారంభించనున్న నూతన రాజకీయ పార్టీకి ప్రజలు ఆశీర్వాదం ఇవ్వాలని కోరుట్ల నియోజకవర్గ జాగృతి నాయకుడు మెడిచెల్మెల నాని అన్నారు. బుధవారం మెట్‌పల్లిలోని అంబేద్కర్ పార్కులో ఈ నెల 25న మేడ్చల్‌లో నిర్వహించే ఆవిర్భావ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరుల ఆశయా లు, ఉద్యమకారుల ఆత్మగౌరవం, సామాజిక తెలంగాణ లక్ష్యంగా కొత్త రాజకీయ శక్తిగా కవిత పార్టీ వస్తోందని తెలిపారు. కోరుట్ల నియోజకవ ర్గంలోని ప్రజలు, యువకులు, మహిళలు, మేధావులు, కళాకారులు, కవులు పెద్ద సంఖ్యలో ఆవిర్భావ సభకు హాజ రై పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్ల జగన్ గౌడ్, పోతారపు రమేష్, సుజాత, కొండ యుగంధర్, కొలిచెల్మెల లత, ప్రీతి, ఏశాల రమేష్, మున్నా, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బీజేపీ నిరసన

**నిజామాబాద్ రూరల్ సిరికొండ, ఏప్రిల్ 22:**

నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ సిరికొండ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉగ్రవాదులతో పోల్చడం అత్యంత దుర్మార్గమైన, అవమానకర మైన వ్యాఖ్య అని బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. దేశాన్ని ప్రపంచ వేదికపై గౌరవస్థానంలో నిలబెట్టిన ప్రధానిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దేశ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని ప్రజలకు, ప్రధానమంత్రికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సిరికొండలో బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టి, మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.దేశ గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం అని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు



## ఇందల్వాయిలో ఖర్గే దిష్టిబొమ్మ దహనం

**ఇందల్వాయి, ఏప్రిల్ 22:**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారిపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం ఇందల్వాయి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మాజీ మండల అధ్యక్షులు నాయిడి రాజన్న ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఇందల్వాయి బస్టాండ్ ఆవరణలో ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేసి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు నాయిడి రాజన్న మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల ముందు భారత ఖ్యాతిని చాటుతున్న ప్రధాని మోడీ గారిపై బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఖర్గే ఇటువంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని మండిపడ్డారు. దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన ఖర్గే వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సక్కి లక్ష్మి నారాయణ, జెల్లల శ్రీనివాస్, ఎల్లారెడ్డిపల్లి సర్పంచ్ మఠంల శేఖర్, నల్లవెల్లి సర్పంచ్ కన్నె రాజేందర్ , స్టేషన్ తాండ సర్పంచ్ జగత్ సింగ్, శ్రీనివాస్, శ్రవణ్,కిరణ్ కుమార్,ఎస్. గంగాధర్, విష్ణు రెడ్డి, మహేష్, భాస్కర్, సంతోష్,బీజేపీ మండల ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల పార్టీ సీనియర్ నాయకులు, యువజన విభాగం నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## తెలుగు పండితురాలు ఆట్ల వరలక్ష్మి ఉద్యోగ విరమణ



**కామారెడ్డి/లింగంపేట్, ఏప్రిల్ 22 :**

లింగంపేట్ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు పండితురాలు శ్రీమతి ఆట్ల వరలక్ష్మి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. 2001లో సేవలో చేరిన ఆమె 24 సంవత్సరాలపాటు విద్యార్థులకు అంకిత భావంతో సేవలందించారు. విద్యార్థుల పట్ల ఆమెకు ఉన్న ప్రేమ, బోధనలో చూపిన నిబద్ధతకు పాఠశాల వర్గాలు ప్రశంసలు వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి మాట్లాడుతూ, "అంకిత భావంతో పని చేస్తే తప్పక గుర్తింపు లభిస్తుంది" అని అన్నారు. వరలక్ష్మి తెలుగు మహాసభల్లో పాల్గొని భాష అభివృద్ధికి చేసిన కృషిని ఆమె కొనియాడారు. గతంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సత్కారం అందుకున్నారని తెలిపారు. విద్యార్థులు తమ ఉపన్యాసాల్లో వరలక్ష్మి ఉపాధ్యాయురాలి సేవలను స్మరించుకుంటూ, ఆమె బోధనను ఎప్పటికీ మరిచిపోమని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి శాలువా, పూలమాలతో ఆమెను సత్కరించి, ప్రభుత్వం అందించిన పదవీ విరమణ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అపర్ణ, నిర్మల, శైలజ, సరస్వతి, ప్రసన్నలక్ష్మి, జ్యోతి, సబితా, సీఆర్పీ సత్యనారాయణతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇటుక బట్టిలో విషాదం :మహిళ మృతి

**నిజామాబాద్ రూరల్ ముగ్పాల్, ఏప్రిల్ 22 :**

ఒడిశా రాష్ట్రం నవపాడా జిల్లా కందుకూనా గ్రామానికి చెందిన పితంబర్ నాగ్ కుటుంబం ఉపాధి కోసం గత డిసెంబర్‌లో సిర్పూర్ గ్రామంలోని ఇటుక బట్టిలో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం పనిలో ఉన్న సమయంలో నీలేద్రీ నాగ్ (35)కు అకస్మాత్తుగా ఛాతి నొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలింది.అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు ముగ్పాల్ ఎస్సై సుష్మిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22;**

భీమారం మండలంలోని భీమారం, బూరుగుపల్లి, నర్సింగాపూర్, కాజిపల్లి గ్రామపంచాయతీలలో ఉపాధి హామీ పనులను బుధవారం డిఆర్డిఓ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కూలీలు రోజుకు ₹307 వరకు వేతనం పొందేలా పనులు చేయాలని సూచించారు. అలాగే వేసవి దృష్ట్యా ఉదయం 6 గంటలకు పని ప్రారంభించి 10 గంటలకే ముగించాలని ఆదేశించారు. కూలీలకు తాగునీరు, షెడ్‌నెట్ సౌకర్యాలు కల్పించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అదనంగా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని తెలిపారు.ఇదే సందర్భంగా దాంపూర్ గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కూడా పర్యవేక్షించారు.

## 4165 ఎకరాల్లో పంట నష్టం



**చేగుంట ఏప్రిల్ 22 :**

మెదక్ జిల్లా, చేగుంట మండలంలో ఇటీవల కురిసిన అకాల వడగండ్ల వానల ప్రభావంపై జిల్లా వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాను వెల్లడించింది. బుధవారం మండలంలోని మక్కరాజ్‌పేట గ్రామంలో దెబ్బతిన్న వరి పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని మక్కరాజ్‌పేట, చందాయిపేట, రాంపూర్, కన్యారం, చిన్న శివ్నూర్ గ్రామాల్లో కలిపి ప్రాథమికంగా 4165 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని గుర్తించినట్లు తెలిపారు. చేతికొచ్చిన వరి పంట నేలపాలు కావడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు. నష్టపోయిన ప్రతి ఎకరాకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తామని, బాధిత రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# విజయనగర సామ్రాజ్య స్థాపకుడు విద్యారణ్యుడు

## వైశాఖ శుక్ల సప్తమి.. విజయనగర రాజ్య స్థాపన దినం
## వైశాఖ శుక్ల సప్తమి విద్యారణ్య స్వామి జయంతి



"సదాశివ సమారంభం శంకరాచార్య మధ్యమాం అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం"...

"అవిద్యారణ్య కాంతారే భ్రమతం ప్రాణినాం సదా, విద్యా మార్గోపదేష్టారం విద్యారణ్య గురుం శ్రయే"...

"విద్యా విద్యావివేకీన పారం, సంసార వారిధే: ప్రాపయత్య నిశం భక్తాన్ తం విద్యారణ్యమాశ్రయే...

ఆదిశంకరుని అనంతరం అంతటి వారిగా పేరెన్నికగన్నారు విద్యారణ్యస్వామి. విఖ్యాత పురుషుడు, మహాయోగి, మహామతి, కవి, తాత్వికుడు, ద్రష్ట, వేదత్రయ భాష్య కర్త, బ్రహ్మవిద్య పారంగతుడు, శ్రౌత స్మార్త క్రియా పరుడు, వేదాంత శాస్త్ర ఆది రచయిత, శతాధిక గ్రంథకర్త, విశేషించి విజయనగర మహా హిందూ సామ్రాజ్య నిర్మాత, రాజ్య స్థాపకుడు, మహామంత్రి, హిందూ మతోద్ధారకుడు, విరూపాక్ష పీఠ స్థాపకుడు, శృంగగిరి పీఠాధిపతిగా పలు విధ ప్రత్యేకతలు లతో , జగత్ ప్రసిద్ధి పొందారు విద్యారణ్యస్వామి.

**1267 లో వైశాఖ శుక్ల సప్తమి నాడు జన్మించి, 1331 లో సన్యాసం స్వీకరించి, శృంగేరి పీఠాధిపత్యం వహించారు. 1386 లో శుద్ధ త్రయోదశి నాడు సిద్ధి పొందారు విద్యారణ్యులు. విద్యారణ్య స్థాపిత పుష్పగిరి తదితర స్థలాలలో, జ్యేష్ఠ శుక్ల త్రయోదశి నాడు, ఆరాధనోత్సవాలు సాంప్రదాయ రీతిలో నిర్వహిస్తారు.**

**ఉత్తర హిందూ దేశమంతా మహమ్మదీయుల వశమై, అన్యమతస్తుల ఆధిపత్యం అధికమైన పరిస్థితులలో, శంకరుని తర్వాత అంతటి వాడైన, ప్రాధాన్యత కలిగిన విద్యారణ్యుడు విద్యానగరం (విజయనగర) సామ్రాజ్య నిర్మాత సామ్రాజ్య రక్షకులు అయినారు. భరత జాతిని జాగృతపరిచే చేందుకు అహరహం శ్రమించి, విశేష కృషి సల్పి లక్ష్యసాధనలో సిద్ధి పొందారు. ముస్లిం మతం బలవంతంగా పుచ్చుకొన ఇష్టపడని స్థితిలో, తిరిగి హిందూ మతంలోకి రావాలనుకునే వారికి, కల్పవృక్షమై నిలిచారాయన.**

1331లో ప్రజోత్పత్తి సంవత్సర కార్తీక శుద్ధ సప్తమి నాడు శృంగేరి పీఠాధిపత్యం వహించారు. తమకు ముందున్న శృంగేరి పీఠాధిపతులు, విద్యా తీర్థుల అనుమతితో శృంగేరి పీఠానికి అనుబంధంగా విరూపాక్ష, పుష్పగిరి, శివగంగ, ఆమని సంకేశ్వర్, కొల్లాపురంలలో స్థాపనలు గావించి, తద్వారా హిందూమత దీక్షలు ఇప్పించి, అన్య మతాల బాధితులకు ఆశ్రయ దాత అయినారు. "పరాశర మాధవీయం" అనే స్మృతి గంధంలో తమ గూర్చి చెప్పుకున్నారు. శ్రీమతి మాయణునిల తనయుడై, సాయన, సోమ నాథుడు ఇరువురు సోదరులు, సింగల సోదరిని కలిగి, కృష్ణ యజుర్వేది, బోధాయన సూత్రుడు, భారద్వాజ సగోత్రుడు, మాధవ జన్మనామం కలిగి, సన్యాసి నుంచి "విద్యారణ్య" నామధేయులైన స్వామి, బాల్యమున విద్యాభ్యాసం నాటికి దక్షిణ భారతంలో ఆర్ష పరిస్థితి శోచనీయమై, వేదశాస్త్రాలు అడుగంటి, శ్రౌతస్మార్త విద్యలు భ్రష్ట మై, ఉపనిషన్మతం పెడత్రోవలో పడి, మతం పలు శాఖలుగా చీలిన పరిస్థితులలో, విద్యారణ్యుడు అవతరించి వేద మతాన్ని ఉద్ధరించారు. మత త్రయాచార్యులు, వేదాంత శాస్త్రాలను మాత్రమే విస్తరింప చేయగా, వేదార్థ విశదీకరణ కానరాని స్థితిలో, గాయత్రీ మంత్రోపాసకుడై, భువనేశ్వరి మాత ప్రత్యక్ష ప్రసన్నతో, హరిహర బుక్కరాయలచే రాజ్యస్థాపన గావించి, 1350-13 ఏళ్ల మధ్య కొంత కాలము మంత్రిగా ఉండి, 1400 గ్రంథాలు రచించి 1380 లో శృంగేరి పీఠాధిపతులై లౌకిక, వైదికాంశములలో, అసమాన ప్రతిభులై, మత, రాజ్యోద్ధరణ గావించినట్లు, చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. సర్వజ్ఞ విష్ణు అనే గురువు వద్ద లేదా వేదాంత శాస్త్రాలు ఆయన అభ్యసించినట్లు సర్వదర్శనం సంగ్రహంలో ఉంది. బ్రహ్మచర్యాశ్రమం నుండి మాధవుడు సన్యసించినట్లు చెబుతారు కానీ చాళుక్య చక్రవర్తి మంత్రి అయిన వీతి హోత్రుని కుమార్తె వీతి హోత్రి అను కన్యను తల్లిదండ్రుల ఆజ్ఞానుసారం పెండ్లి చేసుకుని కొంతకాలం సంసారం సాగరమున ఉన్ననూ, బ్రహ్మచర్య నిష్ఠా గరిష్టుడు అగుటచే యవ్వన వంతులుగా ప్రకాశించి నట్లు పురాణపండ రామ్మూర్తి పేర్కొన్నారు. అన్యమతస్తుల ఆగడాలు కలత పెట్టగా, మాధవుడు తుంగభద్ర తీరాన భువనేశ్వరి అమ్మవారిని గురించి గాయత్రి మంత్రంతో తీవ్ర తపస్సు ప్రారంభించగా అమ్మవారు ప్రత్యక్షమైన వేళ... ఆయన ఐశ్వర్యం కావాలని కోరుకోగా, అందుకు ఆయనకు అర్హత లేదని, అమ్మ వారు చెప్పిన ప్రకారం సన్యసించి శృంగేరి పీఠాధిపత్యాన్ని వహించగా, అప్పుడు, ఆ జగజ్జనని మూడు గడియల సేపు సువర్ణ వృష్టి కురిపించినట్లు కథనాలు. భువనేశ్వరి మాత అనుగ్రహించిన అపార సంపత్తిని విరూపాక్ష పీఠం నెలకొల్పడానికి, విద్యా నగరాన్ని పెంపొందించడానికి, విజయనగర సామ్రాజ్యాన్ని విస్తరింపచేయడానికి ఉపయోగించారు.

### "ధర్మపురితో విద్యారణ్యుల అనుబంధం"

విజయనగర సామ్రాజ్య రాజధాని విజయనగరాన్ని నిర్మించిన, శృంగేరి పీఠం అధిష్టించిన పవిత్రాత్ములకు, ధర్మపురి క్షేత్రంతో విడదీయాలని సంబంధం, అనుబంధం ఉన్నాయి. ప్రాచీన ఆర్ష విద్యా, సంస్కృతులకు కేంద్ర స్థానం అయి, వేద విద్యకు కాణాచియై, చరిత్రకందని అంత పూర్వ కాలికంగా, ఉజ్వల సాంస్కృతిక వైదిక పౌరాణిక పుణ్యస్థలమై, పవిత్ర గోదావరి తీర క్షేత్రమైన ధర్మపురితో, ఆయనకు అత్యంత సాన్నిహిత్యం ఉంది. ఈ నేపథ్యంలోనే శాలివాహన శకం 1258 (క్రీస్తుశకం 1336) ధాత్రు నామ సంవత్సర వైశాఖ శుక్లపక్ష సప్తమి పుష్యమి నక్షత్ర సింహ లగ్నం సుముహూర్తాన, "విజయనగర సామ్రాజ్య స్థాపన" సమయాన ధర్మపురికి చెందిన, చతుర్వేద పండితులను, ఆహ్వానించినట్లు చెప్పబడుతున్నది. పింగళి సూరన "కళా పూర్ణోదయం"లో చతుర్వేదాలు, బ్రాహ్మణ కుమారులుగా, ధర్మపురిలో జన్మించినట్లు గాథ నిర్మించారు. చతుర్వేదాలు ప్రభవించడానికి, యోగ్యమైన క్షేత్రంగా ధర్మపురి సూరన భావించాడు. అంతేగాక ధర్మపురికి, విజయనగర రాజ్యానికి, దగ్గర సంబంధం ఉన్నట్లు, చారిత్రక పరిశోధకులు, బహు గ్రంథ కర్త, డాక్టర్ సంగనభట్ల నరసయ్య ఈ విషయంలో విశేష కృషి సలిపారు. ధర్మపురి లోని యోగ నరసింహుడు విజయనగరంలోనూ ఆరాధనీయుడైనాడు. ధర్మపురి లోని 60 స్తంభాల గుడిని పోలిన వంద స్తంభాల విఠలాలయం హంపిలో ఉంది. హంపీలోని తుంగభద్ర నదిలో కోదండ రామాలయానికి ఎదురుగా ఉన్న చక్రతీర్థం, గోదావరిలోని చక్రతీర్థం పోలి ఉంది. ధర్మపురి లాంటి కళ్యాణ డోలోత్సవ మంటపాలు, విఠలేశ్వర మందిరం అందులోనూ ఉన్నాయి. కృష్ణ దేవరాయల సోదరుడు వీర నరసింహ రాయలు ఉదయమే, నూటొక్క దివ్య క్షేత్రాలు ప్రసాదం తీసుకొనిదే, రాయ సింహాసనం అధిరోహించే వారు కాదట. అలా నూటొక్క దివ్య తిరుపతిలలో ఒకటిగా, నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా ధర్మపురి ప్రసిద్ధమైనది. ధర్మపురి క్షేత్రంలో వీధి వీధికి శివలింగం, నంది, పార్వతి, గణపతి, ఆంజనేయులుతో కూడిన "శివ పంచాయతనాలు" అనబడే గ్రామ రక్షక దేవతల గద్దెలు ఉన్నాయి. ఇలాంటివే శృంగేరి లోనూ ఉన్న నేపథ్యంలో, ధర్మపురి ప్రాంత ప్రభావితుడైన విద్యారణ్యుల ద్వారానే ఈ సాంప్రదాయం ప్రబలినట్లు చెబుతారు. దక్షిణామ్నాయ శృంగేరి పీఠం 12వ అధిపతి అయిన విద్యారణ్యులు, ధర్మపురి లో నివసించి, వేదాధ్యయనం చేసినట్లు, విజయనగర రాజ్య స్థాపకుడు హక్క, బుక్క సోదరులలో జ్యేష్ఠుని పట్టాభిషిక్తుడిని చేసి "హరిహర రాయలు" అని నామమిడినట్లు, ఇది హరి హర క్షేత్ర మైన ధర్మపురి ప్రభావ ఫలితమేనని, హరిహర అభేదమైన నరసింహునికి, శివునికి సమాన పూజలు, అనాదిగా జరుగుతూ, బ్రహ్మ, శివ అంశలతో జన్మించిన ఆంజనేయుని, గణపతి విగ్రహాలు నరసింహ ఆలయంలో కలిగి, శివకేశవ అభేద తత్వాన్ని చాటుతూ, స్మార్త ఆగమ పూజ రీతులతో, శైవ వైష్ణవ ఆగమ విధానాలతో, ఉభయ దేవతలు ఉపాస్యులుగా, ఆచరించే సత్సంప్రదాయం, విద్యారణ్యుల పై తీవ్ర ప్రభావం చూపినట్లు, అది యావత్ భారతానికి ఆదర్శ ప్రాయమైనట్లు భావించ దానికి ఆధారాలు ఊతమిస్తున్నాయి.

**జాతిని ఉత్తేజపరిచిన మహనీయులలో అగ్రశ్రేణికి చెందిన విద్యారణ్యులను ఏడాదికి ఒక నాడైనా ఆరాధించడం, మన విధాయక కృత్యం. వివిధ పీఠాలలో వచ్చే ప్రతి చోట ఆయన స్మరణ, పూజ సాగ వలసి ఉంది.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# సాంప్రదాయ రీతిలో లక్ష్మి నరసింహ నవరాత్రులు ప్రారంభం

ధర్మపురి క్షేత్రస్థ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో బుధ వారం నరసింహ నవరాత్రి ఉత్సవ వేడుకలు సంప్రదాయ రీతిలో ప్రారంభమైనాయి. నరసింహ నవరాత్రి విశేష పూజలతో అకాల మృత్యు భయం ఉండదని, దుష్టగ్రహ బాధలు, పైశాచిక చేతబడులు, ప్రయోగాలను, తిప్పికొట్టే శక్తి నరసింహ మంత్రానికి కలదని భక్తుల ప్రగాఢ విశ్వాసం. శ్రీ యోగానంద, ఉగ్ర లక్ష్మీ సమేత నరసింహ స్వాములు వెలసిన దేవస్థానంలో, నరసింహ నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు సంప్రదాయ పద్ధతిలో ఏటా నిర్వహిస్తున్న క్రమంలో బుధ వారం ప్రారంభ దినాన ఉదయాత్ పూర్వ సమయాన మంగళ వాయిద్యాలతో, వేద మంత్రాలతో, పవిత్ర జలాలను తెచ్చి, ఆలయ అర్చకులు, ఆలయాలను, ఉత్సవ మూర్తులను, సంప్రోక్షణ గావించారు. అనంతరం మూలవిరాట్ లను అభిషేకించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఏ సి, ఈ ఓ సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో, ఈ సందర్భంగా స్వస్తి, గణపతి పూజ, పుణ్యాహ వాచనం, రుత్విక్ వరణం, సంకల్పం, నాంది, విశ్వక్సేన ఆరాధన, అఖండ దీపారాధన, ప్రధాన కలశ స్థాపన, విశేష ఆరాధన, అభిషేకాదులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర కలశ స్థాపన, స్థాపిత దేవతా పూజలు, నవగ్రహ, యోగిని, వాస్తు, క్షేత్రపాలక స్థాపనలు, అగ్ని ప్రతిష్ట, అర్చన, అవధారయాధి ఆరాధన కార్యక్రమాలను, విధి విధాన వేదోక్త సంప్రదాయ రీతిలో నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అనుదినం నిర్వహించే ప్రత్యేక పూజలలో, భాగస్వాములు అయ్యేందుకు, నిర్ణీత రుసుములు, ఆన్లైన్ ద్వారా, చెల్లించిన భక్తుల గోత్ర నామ యుక్త పూజలను





నిర్వహించారు. ప్రసాదాదులను చిరునామాలకు పంపే ఏర్పాట్లు చేయనున్నట్లు ఈఓ శ్రీనివాస్ వివరించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, దేవస్థాన మాజీ అధ్యక్షులు జక్కు రవీందర్, దేవస్థాన ఉపప్రధాన అర్చకులు నేరేళ్ళ శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, చిలుకముక్కు రమణయ్య, అర్చకులు నంబి నర్సింహమూర్తి, నేరేళ్ళ సంతోష్ కుమార్, వొద్దిపర్తి కళ్యాణ్, నేరేళ్ళ విజయ్, నంబి అరుణ్ కుమార్, సముద్రాల వంశీ, చక్రపాణి కిరణ్, నేరేళ్ళ మోహన్, స్థానిక వేపండితులు పెండ్యాల శంకర్ శర్మ, కొరిడె విశ్వనాథ శర్మ, తాడూరి బాలకిష్టయ్య శర్మ, తాడూరి బలరాం శర్మ, నారంభట్ల ప్రశాంత్ శర్మ, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### రామానుజాచార్య తిరు నక్షత్ర వేడుకలు

రామానుజుల తిరు నక్షత్రం సందర్భంగా ప్రధాన దేవాలయంలో గల అభిషేకం మండపంలో రామానుజుల వారికి పంచసూక్తంలతో అభిషేకం, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను సాంప్రదాయ రీతిలో వైభవంగా నిర్వహించారు. ఉపప్రధాన అర్చకులు నేరేళ్ళ శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, చిలుకముక్కు రమణయ్య, అర్చకులు నంబి నర్సింహమూర్తి, నేరేళ్ళ సంతోష్ కుమార్, వొద్దిపర్తి కళ్యాణ్, నేరేళ్ళ విజయ్, నంబి అరుణ్ కుమార్, సముద్రాల వంశీ, చక్రపాణి కిరణ్, నేరేళ్ళ

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# అక్షర సాధ్యం.. సేవా స్వభావం

## పాలెం భాగ్యవిధాత తోటపల్లి సుబ్రహ్మణ్యం!
## నేడు తోటపల్లి సుబ్రహ్మణ్య శర్మ జయంతి..

ఒక మారుమూల చిన్న గ్రామాన్ని రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మార్చడం, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, చివరకు అంతర్జాతీయ పటంలో ఆ ఊరి పేరును సువర్ణాక్షరాలతో లిఖించడం సామాన్యమైన విషయం కాదు. దీని వెనుక ఒక వ్యక్తి అచంచలమైన పట్టుదల, నిస్వార్థమైన సేవా భావం, మొక్కవోని ధైర్యం దాగి ఉన్నాయి. ఆ అరుదైన వ్యక్తిత్వమే తోటపల్లి సుబ్రహ్మణ్య శర్మ. 'పాలెం సుబ్బయ్య'గా పేరుగాంచిన ఆయన, మహబూబ్‌నగర్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం గ్రామాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చారు.



### ఉపాధ్యాయ వృత్తి నుంచి గ్రామ వికాసం వైపు:

1926, ఏప్రిల్ 23న సత్యమూర్తి, భాగీరథమ్మ దంపతులకు జన్మించిన సుబ్రహ్మణ్యం, తొలుత ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అయితే, ఆ వృత్తిలో కంటే సమాజ సేవలోనే తన ఆనందం ఉందని భావించి, రాజీనామా చేసి వ్యవసాయం వైపు మళ్లారు. తన 22వ ఏట తండ్రి మరణించడంతో కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకున్నారు. తన తమ్ముడు రామేశ్వర్‌ను ఉన్నత విద్యావంతుడిని చేయడమే కాకుండా, తనతో పాటే గ్రామ అభివృద్ధిలో భాగస్వామిని చేసి 'రామ-లక్ష్మణుల్లా' ఆదర్శంగా నిలిచారు.

### పాలెం అభివృద్ధికి పట్టిన అక్షర జ్యోతి:

1960 ప్రాంతంలో కేవలం 1300 జనాభా ఉన్న పాలెం గ్రామం జిల్లాలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం. అలాంటి గ్రామంలో విద్యా విప్లవాన్ని తీసుకువచ్చారు సుబ్రహ్మణ్యం. అప్పట్లో కేవలం ఏకోపాధ్యాయ పాఠశాల మాత్రమే ఉన్న పాలెంలో.. ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఓరియంటల్ కళాశాలలను స్థాపించేలా కృషి చేశారు. రాష్ట్రంలోనే ఒక గ్రామంలో ఏర్పాటు చేయబడిన మొదటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా పాలెం రికార్డు సృష్టించింది. ఇక్కడ చదువుకున్న ఎందరో నేడు కవులు, పండితులుగా రాణిస్తున్నారు.

### దాతృత్వంలో సాటిలేని మేటి:

గ్రామ ప్రజల ఆరోగ్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (గ్రాఎజ) రాబట్టేందుకు తన సొంత భూమిని దానం చేయడమే కాకుండా, రూ. 10 వేల విరాళం ప్రకటించి అధికారులను ఆశ్చర్యపరిచారు. అలాగే, జిల్లాలోనే ఏకైక వ్యవసాయ పరిశోధన కేంద్రం పాలెంలో ఏర్పడటానికి తన సొంత భూములను ధారబోశారు. గ్రామంలో ఆధ్యాత్మిక విలువలు పెంచేందుకు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించి, అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించారు.

### అంతర్జాతీయ స్థాయికి 'పాలెం' పేరు:

పాలెం గ్రామానికి బస్సు సౌకర్యం, బస్టాండ్ నిర్మాణం కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిది. పౌల్ట్రీ (కోళ్ళ పరిశ్రమ) రంగంలో ఆయన చేసిన పరిశోధనలు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించాయి. ప్రపంచ పౌల్ట్రీ సంస్థ కోరిక మేరకు అమెరికా వెళ్లి డైరీ, వ్యవసాయ ఉత్పాదకతపై పరిశోధనలు చేసి, ఆ విజ్ఞానాన్ని పాలెం అభివృద్ధికి అన్వయించారు. ప్రధానులు, ముఖ్యమంత్రులు, అంతర్జాతీయ శాస్త్రవేత్తలు పాలెం గ్రామాన్ని సందర్శించారంటే అది కేవలం సుబ్రహ్మణ్యం గారి కృషి ఫలితమే.

**"పాలెం అంటే సుబ్బయ్య.. సుబ్బయ్య అంటే పాలెం" అనేంతగా ఆ ఊరితో మమేకమైన ఆయన 1986, జూన్ 23న కన్నుమూశారు. ఆయన సేవలను గుర్తిస్తూ 1987లో అప్పటి గవర్నర్ కుముద్‌బెన్ జోషి గారు సుబ్రహ్మణ్యం గారి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. నేడు ఆయన జయంతి సందర్భంగా, నిస్వార్థ సేవకు మారుపేరుగా నిలిచిన ఆ మహనీయుడిని స్మరించుకోవడం మనందరి బాధ్యత.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# బహుముఖ ప్రజ్ఞాశాలి సుందర రామకృష్ణ

## నేడు అక్కిరాజు సుందర రామకృష్ణ జన్మదినం

**అక్కిరాజు సుందర రామ కృష్ణ..** వందకు పైగా సినిమాలలో నటించారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన ముఠామేస్త్రి చిత్రంలో అక్కిరాజు గవర్నర్‌గా నటించాడు. ఠాగూర్ సినిమాలో ప్రిన్సిపాల్‌గా కనిపించారు. నాగార్జున నటించిన శివ సినిమాలో లెక్చరర్‌గా, ఎగిరే పావురమా చిత్రంలో సంగీత కారునిగా ఆయన నటించి అందరినీ మెప్పించారు.

**శ్రీకృష్ణ తులాభారం నాటకంలో ప్రముఖ సినీనటి జమునతో కలిసి అనేక ప్రదర్శనలలో నటించారు. జెమిని టీవీలో, తేజ టీవీఛానల్‌లో పెళ్లిపందిరి కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలకు సుమారు 15 సంవత్సరాల పాటు వ్యాఖ్యానం చేశారు.**

ఆదికవి నన్నయ్య, శ్రీనాథ కవిసార్వభౌమ, అల్లసాని పెద్దన, తెనాలి రామకృష్ణ మొదలైన పాత్రలను టీవీ సీరియళ్ళలో పోషించాడు. పౌరాణిక నాటకాలలో శ్రీకృష్ణుడు, బిల్వమంగళుడు, భరతుడు, కాళిదాసు, అర్జునుడు మొదలైన పాత్రలు మంచి పేరు తెచ్చిపెట్టాయి.

**అక్కిరాజు సుందర రామకృష్ణ తండ్రి అక్కిరాజు రామయ్య. తల్లి అన్నపూర్ణమ్మ. ఆయన గుంటూరు జిల్లా నరసారావుపేటలో 23 ఏప్రిల్ 1949లో జన్మించారు. ప్రముఖ రచయిత అక్కిరాజు రమాపతి రావు అయన సోదరుడు. మరొక సోదరుడు అక్కిరాజు జనార్ధనరావు పేరుపొందిన జర్నలిస్ట్. నరసారావు పేటలో డిగ్రీ వరకు చదివిన సుందర రామకృష్ణ హైదరాబాద్‌లో ఎం.ఎ., ఎం.ఓ.ఎల్.,ఎం.ఫిల్ చేశారు. తరువాత ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి వేంకట పార్వతీశ కవులు – రామాయణ పద్యకృతులు అనే అంశంపై ఇరివెంటి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నారు. థియేటర్ ఆర్ట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా చేశారు. తెలుగు సంస్కృతం ఆంగ్లం కలిపి నూతన మణిప్రవాళ భాషను సృష్టించినవారు. సందర్భోచితంగా ఉర్దూ పదాలు కూడా చాలా వాడుకున్నారు.**

అమ్మతోడు, కేశవామాధవా, కోనేటి రాయనికి, బాపూరమణా, తేనీటి విందు, కవీశ్వరా, శంకర నారాణీయము,రాజేశ్వరీ శతకము, శ్రీ శనీశ్వర శతకము, అమెరికాలో కవిసుందర్ – శ్యామసుందర్, కవితాశరధి దాశరథి, ఆంజనేయ శతకం, భీమన్న, భీమలింగ శతకం మొదలైన కావ్యాలు వ్రాశారు.

**బాల్యం నుండే నటన గానం పట్ల మక్కువ చూపేవారు. ఈలపాట రఘురామయ్య, సూరిబాబు, ఘంటసాల వెంకటేశ్వరరావు మొదలైన వారిని అనుకరించే వారు. ఆయన గొప్ప గాయకుడే కాక మంచి సంగీత దర్శకుడు కూడా. లక్ష్మీనరసింహ సుప్రభాతం, బాసర సరస్వతీ వైభవం, శ్రీకృష్ణ రాయబారం, షిర్డీసాయి సుప్రభాతం, గణేశ సుప్రభాతం, వేంకటేశ్వర స్తుతి, క్రీస్తు రక్షకా మొదలైన సి.డి.లను కూర్చి విడుదల చేశారి. ఆలిండియా రేడియో, దూరదర్శన్‌లలో ఏ గ్రేడ్ డ్రామా ఆర్టిస్ట్ గా వున్నారు.**

2005లో నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపకుడిగా. సన్మానం పొందారు. ఇంటర్ మీడియెట్ తెలుగు పాఠ్య పుస్తకాలలో పాఠాలను తయారు చేశారు. 2007లో లెక్చరర్‌గా పదవీ విరమణ చేశారు.

**కవితా గాండీవి, నాట్య శ్రీనాథ, అభినవ తెనాలి రామకృష్ణ, అభినవ ఘంటశాల, పద్య విద్యామణి, కళాప్రవీణ, వశ్యముఖి తదితర బిరుదులు సత్కారాలు పొందారు.**

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

# పుస్తకాల పరిరక్షణ.. సామాజిక బాధ్యత

## నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం


(ఈద మధుకర్, సీనియర్ జర్నలిస్ట్)

ప్రపంచ పుస్తక దినోత్సవం (ప్రపంచ కాపీ హక్కుల దినోత్సవం) ప్రతి ఏట ఏప్రిల్ 23న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. 1995 నుండి నిర్వహించబడుతున్న ఈ ప్రపంచ పుస్తక దినోత్సవం రోజున పుస్తకం చదవడం, ప్రచురించడం, కాపీ హక్కులు వంటి విషయాలను ప్రోత్సహించి వాటి గురించి విస్తృత ప్రచారం చేస్తారు. ప్రపంచ ప్రఖ్యాత రచయిత మిగ్యుఎల్ డి సెర్వంటెస్ పుట్టి మరణించిన తేది ఏప్రిల్ 23, విలియం షేక్స్పియర్, గార్సియాసా డి లా వేగా వంటి రచయితలు మరణించిన తేది, అనేక ఇతర రచయితల పుట్టిన, మరణించిన తేది ఏప్రిల్ 23వ తేది అవడంవల్ల 1995, ఏప్రిల్ 23న యునెస్కో తొలిసారిగా ప్రపంచ పుస్తక దినోత్సవంను నిర్వహించింది.

**చినిగిన చొక్కా అయినా తొడుక్కో...కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంటాయి.**

**కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ ఇతరములు ఎన్ని దరిజేరుతున్నా, పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు.**

**మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. ఒక్కసారి విజ్ఞాన సముపార్జన తృష్ణ మొదలైంది అంటే, తుదివరకు అది మనిషి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకం.**




అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు



కదలిక అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంతమైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయుప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సర స్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వహించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది.

గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్యశాస్త్రం హాలుని 'గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావా లనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్ మన దేశ తత్వ సాహిత్యాన్ని తెరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికల సందర్శనలకు హేతువులైనాయి. చైనా, టిబెట్, అఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శృతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరిణామాల క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు ప్రస్తాన త్రయం, భారత భాగవత రామాయణాలు ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం గ్రంథ రూపం సంతరించు కున్నాక, ప్రపం చంలో ఏజాతీ, ఏదేశం, భారత దేశానికి సాటి రావని సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం.

ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాలయాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడుకునేది. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటేమిటి...వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. ఈ విషయా లను అర్థం చేసుకుని, పుస్తక దినోత్సవం సందర్భంగా పఠనాసక్తిని పెంపొందించే కృషి



# సినీ వినీలాకాశంలో ధృవ తార సత్యజిత్ రాయ్


## నేడు సత్యజిత్ రాయ్ వర్ధంతి

(ఈద మధుకర్, సీనియర్ జర్నలిస్ట్)

**సత్యజిత్ రాయ్... సినిమాల గురించి ఏ కొంచెం అవగాహన ఉన్నా, ఈ పేరు సుపరిచితమే. ప్రపంచం లోని సినీ దర్శకులలో అగ్రశ్రేణికి చెందిన ప్రతిభాశాలి సత్యజిత్ రాయ్. దర్శకత్వం మటుకే కాక, కథారచన, స్క్రీన్ ప్లే, ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ, సంగీత దర్శకత్వం, కళా దర్శకత్వం ఇలా సినిమాలకు సంబంధించిన శాఖలలోనే కాకుండా చిత్రకళ లోనూ, సాహిత్యం లోనూ సాటి లేని మేటిగా తనదైన ప్రత్యేకత చాటుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి.**

సత్యజిత్ రాయ్ (మే 2 1921–ఏప్రిల్ 23 1992) భారత దేశంలోని బెంగాల్ రాష్ట్రానికి చెందిన సినీ దర్శకుడు, రచయిత. అయన ప్రపంచ సినిమాలో 20వ శతాబ్దపు ఉత్తమ దర్శకుల్లో ఒకడుగా పేరు గడించారు. కలకత్తాలో బెంగాలీ కళాకారుల కుటుంబములో జన్మించి ప్రెసిడెన్సీ కాలేజ్‌లో ఎకనామిక్స్ చదువుకున్న సత్యజిత్ 1940–41లో తమ కుటుంబానికి మిత్రుడైన రవీంద్ర నాథ ఠాకూర్ బతికుండగానే శాంతినికేతన్ వెళ్ళి చిత్రకళ అభ్యసించారు. సినిమాలూ, గ్రామఫోన్ రికార్డ మోజుతో 1942లో కలకత్తాకు తిరిగి వచ్చారు. 1943 నుంచి సుమారు పన్నెండేళ్ళపాటు ఒక బ్రిటిష్ అడ్వర్టైజింగ్ కంపెనీలో పని చేశాక సినీ రంగంలో కాలు మోపారు. 1955లో పథేర్ పాంచాలీ సినిమాకు దర్శకత్వం వహించిన తరవాత దర్శకుడుగా దేశవిదేశాల్లో పేరు సంపాదించు కున్నారు. అంతకు ముందే కలకత్తా ఫిల్మ్ సొసైటీని స్థాపించడంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. 1949లో కలకత్తాకు వచ్చిన ప్రసిద్ధ ఫ్రెంచ్ దర్శకుడు ఝెూ రెన్వార్ వెంట తిరిగి సమకాలీన సినిమా గురించి అవగాహన చేసుకున్నారు.

సంవత్సరానికి ఒక సినిమా చొప్పున అతను దర్శకత్వం వహించిన సినిమాలన్నీ ప్రపంచ ప్రసిద్ధిని పొందాయి. కొన్ని బెంగాలీ సాహిత్యం నుంచి తీసుకున్న కథలైతే కొన్ని స్వయంగా రాసుకునవి. సీరియస్ కళాఖండాలే కాక పిలల కోసం



సాహసాలూ, హాస్యంతో కూడిన సినిమాలూ తీశారు. సున్నితమైన హాస్యం, వ్యంగ్యం, వాస్తవిక జీవిత చిత్రణ, అపూర్వం అనిపించే సినీ పరిభాషా, కళా నైపుణ్యం అడుగడుగునా ఆయన సినిమాల్లో కనిపిస్తాయి. ప్రపంచంలోని ఫిల్మ్ ఇన్స్టిట్యూట్‌లన్నీ ప్రత్యేకంగా అధ్యయనం చేసే దర్శకుల్లో రాయ్ ఒకరు. రవీంద్రుడి 'చారులతా' మొదలుకొని పిల్లల సినిమా 'గోపీ గాయేన్' వంటి జానపద చిత్రాలూ, హిందీలో ప్రేంచంద్ కథ ఆధారంగా 'శత్‌రంజ్ కే ఖిలాడీ', రవీంద్రనాథ ఠాకూర్ మీద అద్భుతమైన డాక్యుమెంటరీ ఒకటీ ఇలా ప్రతీ ఒక్కటీ కళాఖండం అనిపించేట్టుగా నిర్మించారు. ఆయనకు దర్శకత్వమే కాక, సినిమా తీయడంలోని ఇతర విభాగాల పట్ల కూడా మంచి పట్టు ఉందేది. తమ సినిమాలో చాలా వాటికి స్క్రీన్ ప్లే, కేస్టింగ్, సంగీతము, సినిమాటోగ్రఫీ, కళా దర్శకత్వము, కూర్పు, పబ్లిసిటీ డిజైన్ చేసుకోవడము – వంటివి కూడా ఆయనే చూసుకునేవారు.

రాయ్ సినిమాలు, లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలు కలిపి మొత్తము ముప్పై ఏడు చిత్రాలకు దర్శకత్వము వహించాడు. ఆయన మొదటి సినిమా పథేర్ పాంచాలీ, కేన్స్ చలనచిత్రోత్సవములో 11 అంతర్జాతీయ బహుమతులు గెలుచుకుంది.

**కంప్యూటర్ ఫాంట్‌లు వ్యాప్తిలోకి రాకముందే రాయ్ బెంగాలీ అక్షరమాలలో కొత్త శైలులని ప్రవేశపెట్టారు. బెంగాలీలో అనేక కథలూ, వ్యాసాలూ, నవలలూ కూడా రాశారు. సైన్స్ ఫిక్షన్, డిటెక్టివ్ సాహిత్యం మొదలైన ప్రత్యేక విషయాల గురించి కథలు రాసి, ఫేలూ దా మొదలైన పాత్రలతో జైసల్మేర్ కోట నేపథ్యంతో 'షోనార్ కెల్లా' వగైరా సినిమాలు కూడా తీశారు.**

బెంగాలీ సంస్కారాన్నీ, భారతీయతనూ ఒంట పట్టించుకుని ప్రపంచ స్థాయికి ఎదిగిన సత్యజిత్ రాయ్ ఏ ప్రక్రియను చేపట్టినా ప్రతిభా వంతంగా నిర్వహించ గలిగారు. తన చిన్నతనంలోనే ఆర్థర్ కోనన్ డాయిల్ డిటెక్టివ్ కథలనూ, ఎచ్.జి.వెల్స్ తదితరుల సైన్స్ ఫిక్షన్ సాహిత్యాన్నీ అభిమానించే వారు.

**సత్యజిత్ రాయ్ పిల్లల కోసం "ఫెలూదా" అన్న డిటెక్టివ్ ని సృష్టించారు. 1965 మొదలుకుని 1994 దాకా 35 ఫెలూదా నవలలు రాసారు. ఇందులో – ఫెలూదా, అతని కజిన్ తపేష్, జటాయు అని పిలువబడు లాల్ మోహన్ గంగూలీ ప్రధాన పాత్రలు. వీరు ముగ్గురు కలిసి పరిష్కరించే సమస్యల సంకలనమే ఫెలూదా కథలు. ఇది కాక సత్యజిత్ రాయ్ ప్రొఫెసర్ శొంకు అన్న మరో పాత్రని కూడా సృష్టించి నవలలు రాసారు. బెంగాలీ పిల్లల సాహిత్యంలో ఈ రెండు పాత్రలకి ఓ విశిష్ట స్థానం ఉంది.**

సినిమాలు తీయడమే కాక రాయ్ ఎన్నో పుస్తకాలు, వ్యాసాలు కూడా రాసాడు. అలాగే, ఆయన ప్రచురణ కర్త కూడా. బెంగాలీ పిల్లల పత్రిక "సందేశ్"ను చాలా ఏళ్ళు నిర్వహించాడు. అనేక అవార్డులు పుచ్చుకున్న రాయ్ 1992 లో ఆస్కార్ కూడా అందుకున్నారు.

**40 ఏళ్ళు సినీరంగంలో ఓ వెలుగు వెలిగి, మరణించేందుకు 23 రోజుల ముందు ఆ పురస్కారాన్ని స్వీకరించి, ఆస్కార్ పురస్కాన్ని అందుకున్న తొలి భారతీయునిగా, ఆపైన భారతరత్న పురస్కారం పొందిన తొలి చలనచిత్ర రంగ ప్రముఖునిగా నిలిచారు. సత్యజిత్ రాయ్ మరణానంతరం భారత ప్రభుత్వ తపాలా శాఖ ఆయన పై ఓ స్టాంపును విడుదల చేసింది.**



# ధోనీపై మారిన అభిప్రాయం

### సైనికుడిగా నిరూపించుకున్న కెప్టెన్ కూల్

ఎంఎస్ ధోనీ అంటే క్రికెట్ గుర్తుకు వస్తుంది. కానీ ఆయనలో దేశభక్తి కూడా అంతే గట్టిగా ఉందని మరోసారి స్పష్టమైంది. భారత ప్రాదేశిక సైన్యంలో గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదా పొందిన ధోనీ, ఆ పాత్రలోనూ తన నిబద్ధతను చాటుకున్నారు. ఈ హోదా ఇవ్వడంపై తొలినాళ్లలో కొంత వ్యతిరేకత ఉన్నట్లు రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ వినోద్ భాటియా వెల్లడించారు. ముఖ్యంగా 'మెరూన్ బెరెట్' వంటి ప్రతిష్టాత్మక గుర్తింపును సాధారణ వ్యక్తికి ఇవ్వడంపై సందేహాలు వ్యక్తం చేశానని తెలిపారు. పారాట్రూపర్ అవ్వాలంటే కఠినమైన శిక్షణ అవసరం ఉండగా, అలాంటి పరీక్షలు లేకుండా ఈ గౌరవం ఇవ్వడం సరికాదని అప్పట్లో భావించినట్లు చెప్పారు. అయితే, ధోనీ తన ప్రవర్తనతో ఆ అనుమానాలను పూర్తిగా చెదరగొట్టారని భాటియా పేర్కొన్నారు. 106 పారా టీఏ బెటాలియన్‌లో చేరిన ధోనీ, సాధారణ సైనికుడిలాగే క్రమశిక్షణతో వ్యవహరించడమే కాకుండా, 2015లో ఐదు పారాచూట్ జంప్‌లు పూర్తి చేసి 'పారా వింగ్' సాధించారు. ఎత్తుపై భయం ఉన్నప్పటికీ, దేశం కోసం ఆ భయాన్ని జయించి తన కర్తవ్యాన్ని నిర్వర్తించిన ధోనీపై భాటియా ప్రశంసలు కురిపించారు. జమ్మూ కశ్మీర్‌లో నియంత్రణ రేఖ వద్ద సైనికులతో కలిసి పనిచేసిన ఆయనలో నిజమైన సైనికుడి లక్షణాలు కనిపించాయని అన్నారు. దీంతో తొలినాళ్లలో ఉన్న తన అభిప్రాయం పూర్తిగా మారిందని భాటియా వెల్లడించారు.



# రాహుల్‌పై విమర్శల వర్షం..

### బ్యాటింగ్, కీపింగ్ రెండూ నిరాశ

ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడుతున్న లోకేష్ రాహుల్ ప్రదర్శనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత సీజన్లలో మెరుగైన రికార్డులు కలిగిన ఈ స్టార్ బ్యాటర్, ఈసారి మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 243 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేధించే క్రమంలో రాహుల్ 23 బంతుల్లో 37 పరుగులకే పరిమితమయ్యాడు. స్ట్రైక్‌రేట్ బాగానే ఉన్నప్పటికీ, అవసరమైన సమయంలో దూకుడుగా ఆడకపోవడం జట్టుపై ప్రభావం చూపిందని విమర్శలు వస్తున్నాయి. అదే మ్యాచ్‌లో కీపింగ్‌లోనూ రాహుల్ తప్పిదాలు చేశాడు. కీలక సమయంలో అభిషేక్ శర్మను రన్ అవుట్ చేసే అవకాశం వదిలేయగా, ఆ తర్వాత అతడు భారీ స్కోర్ నమోదు చేయడం మ్యాచ్ మలుపు తిప్పింది. ఈ ప్రదర్శనతో సోషల్ మీడియాలో రాహుల్‌పై ట్రోల్స్ పెరిగాయి. అభిమానులు అతని ఆటతీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా కూడా పెద్ద లక్ష్యాలను ఛేదించాలంటే పవర్‌ప్లేను సరిగ్గా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని సూచించాడు.




# సోనీ చేతికి ఆసియా క్రీడల ప్రసార హక్కులు

**ఢిల్లీ:** ఈ ఏడాది సెప్టెంబర్‌లో జపాన్ ఆతిథ్యమివ్వనున్న 20వ ఆసియా క్రీడల ప్రసార హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 04 దాకా జరుగబోయే ఈ మెగా ఈవెంట్‌ను భారత్‌లో సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ చానెల్స్ ద్వారా వీక్షించొచ్చు. నిరుడు ఆసియా క్రీడల్లో రికార్డు స్థాయిలో 107 పతకాలు సాధించిన భారత్.. ఈసారి ఆ సంఖ్యను మరింత పెంచాలనే లక్ష్యంతో ఉంది.

# రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం



## లక్నోపై 40 పరుగుల తేడాతో గెలుపు!

### రాణించిన రవీంద్ర జడేజా, జోఫ్రా ఆర్చర్
### మిచెల్ మార్ష్ ఒంటరి పోరాటం వృథా
### 119 పరుగులకే కుప్పకూలిన లక్నో
### ఎకానా బీ గ్రౌండ్‌లో ఆర్ఆర్ ఆధిపత్యం







**లక్నో, ఏప్రిల్ 22 (మనసులో మాట):** ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా బుధవారం ఎకానా క్రికెట్ స్టేడియం బీ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ అద్భుత విజయం సాధించింది. సొంత మైదానంలో లక్నో సూపర్ జెయింట్స్ జట్టును 40 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసింది. బౌలింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై రాజస్థాన్ ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. టాస్ గెలిచిన లక్నో కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకోగా.. రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్య ఛేదనలో లక్నో బ్యాటర్లు తడబడటంతో ఆ జట్టు 18 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌ ట్ అయింది.

### జడేజా బాధ్యతాయుత ఇన్నింగ్స్

ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ జట్టుకు ఓపెనర్ యశస్వి జైస్వాల్ (12 బంతుల్లో 22 పరుగులు) మెరుపు శుభారంభం ఇచ్చాడు. స్వల్ప వ్యవధిలోనే వికెట్లు పడుతున్న దశలో ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఆఖరి వరకు అజేయంగా క్రీజులో నిలిచిన జడేజా 29 బంతుల్లో 43 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. అతనికి తోడుగా షిమ్రాన్ హెట్మెయిర్ (18 బంతుల్లో 22 పరుగులు) విలువైన పరుగులు సాధించాడు. లక్నో బౌలర్లలో మోసిన్ ఖాన్ అద్భుతంగా బౌలింగ్ చేసి 4 ఓవర్లలో కేవలం 17 పరుగులు ఇచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. యువ బౌలర్ ప్రిన్స్ యాదవ్ 29 పరుగులకు 2 వికెట్లు తీయగా.. వెటరన్ పేసర్ మహమ్మద్ షమీ 30 పరుగులిచ్చి 2 వికెట్లు దక్కించుకున్నాడు.

### కట్టడి చేసిన ఆర్ఆర్ బౌలర్లు..
### మార్ష్ పోరాటం వృథా

160 పరుగుల లక్ష్య ఛేదనలో లక్నో సూపర్ జెయింట్స్ ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. రాజస్థాన్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు లక్నో బ్యాటర్లు విలవిలలాడారు. ఆసీస్ ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్ (41 బంతుల్లో 5 5 పరుగులు) హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేసినా అతనికి మిగతా బ్యాటర్ల నుంచి కనీస సహకారం లభించలేదు. నికోలస్ పూరన్ 25 బంతుల్లో 22 పరుగులు చేసి నిరాశపరిచాడు. హిమ్మత్ సింగ్ (15 బంతుల్లో 15 పరుగులు) తక్కువ స్కోరుకే వెనుతిరిగాడు. రాజస్థాన్ బౌలర్లలో ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ లక్నో బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశాడు. 4 ఓవర్లలో 20 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. నాంద్రే బర్గర్ 4 ఓవర్లలో 27 పరుగులిచ్చి 2 వికెట్లు తన ఖాతాలో వేసుకోగా.. బ్రిజేష్ శర్మ 3 ఓవర్లలో 18 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి లక్నో పతనాన్ని శాసించారు.





# మా సక్సెస్‌కు కారణం అదే: ఇషాన్ కిషన్

ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ వం-సగా మూడో విజయంతో జోరును కొనసాగిస్తోంది. ఉప్పల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై 47 పరుగుల తేడాతో గెలిచిన ఈ జట్టు, పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరింది. ఇప్పటివరకు 7 మ్యాచ్‌లలో నాలుగు విజయాలు నమోదు చేసింది. విజయం అనంతరం కెప్టెన్ ఇషాన్ కిషన్ మాట్లాడుతూ, తమ జట్టు విజయానికి సరళమైన వ్యూహమే కారణమని వెల్లడించాడు. ఒక్కో మ్యాచ్‌ను ప్రత్యేకంగా తీసుకుంటూ, పరిస్థితులకు అనుగుణంగా ఆడటమే తమ బలం అని చెప్పాడు. అభిషేక్ శర్మ ఇన్నింగ్స్, చివర్లో హెన్రిచ్ క్లాసెన్ ఫినిషింగ్ జట్టుకు పెద్ద ప్లస్ అయ్యాయని పేర్కొన్నాడు. పిచ్‌ను అర్థం చేసుకున్న తర్వాత దూకుడుగా ఆడటమే తమ విధానం అని వివరించాడు. బౌలింగ్‌లోనూ కీలక సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం కలిసి వచ్చిందని, ఆటను ఆస్వాదిస్తూ ఆడమనే సందేశమే జట్టును ముందుకు నడిపిస్తోందని ఇషాన్ తెలిపాడు.





# ఐసీసీ నుంచి వైదొలిగిన పీసీబీ మాజీ సీఈవో

పాకిస్థాన్ మాజీ సీఈవో వాసిమ్ ఖాన్ అంతర్జాతీయ క్రికెట్ కమిటీ నుంచి వైదొలిగారు. ఐసీసీ జనరల్ మేనేజర్ పదవికి గుడ్‌బై చెప్పేశారు. నాలుగేళ్లపాటు ఆ బాధ్యతలు నిర్వర్తించిన ఆయన పదవిని వీడారు. జెఫ్ అల్లార్డైస్ నుంచి 2022లో వాసిమ్ ఖాన్ బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు ఆయన పీసీబీ సీఈవోగా మూడేళ్లు పనిచేశారు. ఇప్పుడు వైదొలిగినా.. మరో పదవీ బాధ్యతలను తీసుకొనే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు తెలిపాయి.



# శ్రీలీల మళ్లీ గాడిలో పడేనా?

టాలీవుడ్ యంగ్ బ్యూటీ శ్రీలీల మరోసారి తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకుంది. ఐవరీ అనార్కలి డ్రెస్సులో గోల్డ్ ఎంబ్రాయిడరీతో ఆమె కనిపించిన తీరు ఎలిగెన్స్‌కు నిదర్శనంగా నిలిచింది. సింపుల్ లుక్‌లోనే ఆకర్షణీయంగా మెరిసి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే సినిమాల విషయానికి వస్తే, ఇటీవల వచ్చిన 'రాబిన్‌హుడ్', 'జూనియర్', 'ఉస్తాద్ భగత్ సింగ్' ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయాయి. ముఖ్యంగా ఆమె పాత్రలకు సరైన ప్రాధాన్యం లేకపోవడం విమర్శలకు కారణమైంది. ఇప్పటికీ గ్లామర్, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో మంచి క్రేజ్ ఉన్న శ్రీలీల, సరైన కథలు ఎంపిక చేసుకుంటే మళ్లీ హిట్ ట్రాక్‌లోకి రావడం కష్టమేమీ కాదని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.

# చిరుతో బాబీ సినిమా

## నెగెటివ్ రోల్‌లో డింపుల్ హయతి


టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద 'వాల్తేరు వీరయ్య'తో మ్యాజిక్ చేసిన మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి మళ్ళీ చేతులు కలిపారు. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులను ముగించుకుని షూటింగ్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. ఇక ఈ సినిమాలో చిరు సరసన ప్రియమణి హీరోయిన్‌గా నటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి తాజాగా వినిపిస్తున్న ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం బోల్డ్ బ్యూటీ డింపుల్ హయాతిని ఎంపిక చేసినట్లు సమాచారం. సాధారణంగా డింపుల్ హయాతి అంటే గ్లామర్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్. కానీ బాబీ ఈ సినిమాలో ఆమెను సరికొత్తగా చూపించబోతున్నారట. ఇందులో ఆమె హీరోయిన్ కాదు అని, నెగిటివ్ షేడ్స్ ఉన్న ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తుందని తెలుస్తోంది. మెగాస్టార్ వంటి దిగ్గజ నటుడికి ఎదురు నిలిచే పాత్ర కావడంతో డింపుల్ రోల్ చాలా ఇంటెన్సివ్‌గా ఉండబోతోందట. ఈ డిఫరెంట్ కాస్టింగ్ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని ఫిలిం నగర్ వర్గాలు భావిస్తున్నాయి. కమెగాస్టార్ ఒక సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారని, బాబీ ఈ పాత్రను చాలా స్టైలిష్‌గా డిజైన్ చేశారని టాక్.





# 'కాక్‌టెయిల్ 2'లో కృతి అందాల అరాచకం

బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ 'కాక్‌టెయిల్ 2'లో తన స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటోంది. హోమీ అదజానియా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 19, 2026న విడుదల కానుంది. ఇందులో షాహిద్ కపూర్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా కృతి షేర్ చేసిన ఫోటోల్లో బోహో స్టైల్ ఫ్లోరల్ డ్రెస్‌లో ఆమె గ్లామర్ హైలెట్ అయింది. సముద్రం నేపథ్యంగా తీసిన ఈ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. స్టార్ కాస్ట్, రొమాంటిక్ కథతో 'కాక్‌టెయిల్ 2'పై ఇప్పటికే మంచి క్రేజ్ ఏర్పడింది.





# నాభి అందాలతో నషా ఎక్కిస్తున్న అదితి గౌతమ్


## క్రేజీ పోజులకు నెటిజన్స్ మైండ్ బ్లాక్


అదితి గౌతమ్ తన లేటెస్ట్ బోల్డ్ ఫోటోషూట్‌తో కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తోంది. తన నాభి అందాలను ఎరగా వేస్తూ, నషా ఎక్కించే కిల్లర్ పోజులతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ గ్లామరస్ ట్రీట్‌కు నెటిజన్లు క్లీన్ బౌల్డ్ అవుతూ, ఆమె హాట్ అండ్ సెన్సేషనల్ లుక్స్‌ను వైరల్ చేస్తున్నారు! తాజా ఫోటోలలో ఆమె ట్రెండీ అవుట్‌ఫిట్‌లో కనిపిస్తూ, ధైర్యమైన పోజులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె లుక్, ప్రెజెన్స్ నెటిజన్లను ఆకట్టుకుని, ఫోటోలు వైరల్ అవుతున్నాయి. అదితి గౌతమ్ ఈ ఫోటోషూట్ ద్వారా మరోసారి తన గ్లామర్ ఇమేజ్‌ను బలంగా ప్రదర్శించిందని చెప్పవచ్చు.

# కొత్త గృహంలోకి ప్రవేశించనున్న బన్నీ

## జూబ్లీహిల్స్‌లో ఖరీదైన ఇంటి నిర్మాణం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో తన క్రేజ్‌ను రోజు రోజుకు పెంచుకుంటూ, సంపాదనలోనూ కొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. 'పుష్ప' సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన, సినిమాల ద్వారా మాత్రమే కాకుండా బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, భారీ రెమ్యునరేషన్లతో టాలీవుడ్‌లో అత్యధిక ఆదాయం పొందుతున్న నటులలో ఒకరిగా నిలిచారు. ఈ విజయాలకి తగ్గట్టుగానే ఆయన జీవనశైలిని కూడా విలాసవంతంగా తీర్చిదిద్దుకుంటున్నారు. ఇప్పటికే సినీ రంగంలోనే కాకుండా వ్యాపార రంగంలో కూడా అడుగుపెట్టిన బన్నీ, 'అల్లు స్టూడియోస్' నిర్మాణంతో తన విజన్‌ను చూపించారు. ఇప్పుడు అదే స్థాయిలో తన వ్యక్తిగత జీవితంలో కూడా ఓ భారీ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన జూబ్లీహిల్స్‌లో ఆయన నిర్మిస్తున్న కొత్త మేన్షన్ ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ లగ్జరీ హౌస్ సుమారు 4 వేల చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మితమవుతోంది. అత్యాధునిక సదుపాయాలు, ప్రీమియం ఇంటీరియర్స్, ప్రత్యేక డిజైన్‌లతో ఈ ఇంటిని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఈ మేన్షన్ నిర్మాణానికి దాదాపు రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇది పూర్తయితే జూబ్లీహిల్స్‌లోనే అత్యంత ఖరీదైన మరియు స్టైలిష్ ఇళ్లలో ఒకటిగా నిలవనుంది. ఈ మేన్షన్ మరో ప్రత్యేకత ఏమిటంటే, ఇది మెగాస్టార్ చిరంజీవి నివాసానికి సమీపంలోనే ఉండటం.సినీ కుటుంబం మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించేలా ఈ ఇంటి లొకేషన్ కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రస్తుతం ఈ నిర్మాణం తుదిదశకు చేరుకోగా, ఈ ఏడాది చివర్లో అల్లు అర్జున్ తన కుటుంబంతో కలిసి గృహప్రవేశం చేయనున్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ నిర్మిస్తున్న ఈ కొత్త మేన్షన్ కేవలం ఒక ఇల్లు మాత్రమే కాదు.. ఆయన సాధించిన విజయాలకు ప్రతీకగా నిలిచే ఒక ల్యాండ్‌మార్క్‌గా మారబోతోందని అభిమానులు భావిస్తున్నారు.




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com